
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత గురువారం గరిష్ఠం : 30.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

శుక్రవారం 25 జూలై 2025

పాహిమాం చౌడేశ్వరీ..!

● భక్తిశ్రద్ధలతో అమ్మవారి జయంతి ● ఆలయాలకు పోటెత్తిన భక్తులు





అనంతలో చౌడేశ్వరి మాతను దర్శించుకుంటున్న భక్తులు, మొదటిరోడ్డు చౌడేశ్వరి దేవాలయంలో అలంకరణలో అమ్మవారు

అనంతపురం టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): చౌడేశ్వరి జయంతి వేడుకలను గురువారం నగరంలోని పలు ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. మొదటిరోడ్డు, సర్వజనాస్పత్రి, గుత్తిరోడ్డు ఐదులైట్ల సర్కిల్‌లోని చౌడేశ్వరీ మాత ఆలయాల్లో అమ్మవారి మూల విరాట్‌లకు అభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజాదులు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆయా ఆలయాల కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పీడీగా శ్రీదేవికి ప్రమోషన్

అనంతపురం క్రైమ్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ప్రాజెక్టు పీడీగా శ్రీదేవికి ఉద్యోగోన్నతి లభించింది. ఈమెను తూర్పుగోదావరి జిల్లా పీడీగా నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి సూర్యకుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈమె తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లో అదనపు బాలల అభివృద్ధి ప్రాజెక్టు అధికారిగా పని చేస్తున్నారు. అలాగే మడకశిర ప్రాజెక్టు సీడీపీఓ జ్ఞాన ప్రసూనకు ప్రమోషన్ ఇచ్చి గుంటూరు జిల్లా ఐసీడీఎస్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా బదిలీ చేశారు. సోమందేపల్లి సీడీపీఓ భానుశ్రీని ఏపీ మహిళా కమిషన్ ఈడీగా డెప్యుటేషన్‌పై పంపారు. తిరుపతి జిల్లా పుత్తూరు సీడీపీఓ ప్రమీలను శ్రీసత్యసాయి జిల్లా పీడీగా నియమించారు.

అధికంగా కృష్ణాజలాలు

● కేటాయింపులకు మించి తీసుకుంటాం

● జలవనరుల శాఖ సీఈ నాగరాజ, హంద్రీనీవా ఎస్ఈ రాజాస్వరూప్ కుమార్

7లో



వాయనం సమర్పిస్తున్న ఈఈ, ఎస్ఈ, సర్పంచ్‌లు

ఎట్టకేలకు..!

ఎంపీఈఓల సర్దుబాటుకు శ్రీకారం

ఉమ్మడి జిల్లాలో 323 మంది విధుల నిర్వహణ

అనంత జిల్లా ఎంపీఈఓల సర్దుబాటుకు కసరత్తు

శ్రీ సత్యసాయి జిల్లా యంత్రాంగం తీరుపై విమర్శలు



అనంతపురం అర్బన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలో పని చేస్తున్న ఎంపీఈఓల సర్దుబాటుకు శ్రీకారం చుట్టారు. అనంతపురం జేడీఏ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ అనంత జిల్లాలోని ఏడీఏలతో గురువారం సమావేశమయ్యారు. ఏఏ రైతు సేవా కేంద్రంలో ఎంపీఈఓలను నియమించాలి..? ఎక్కువ విస్తీర్ణం కలిగిన ఏఏ ప్రాంతాల్లో ఎంత మంది ఎంపీఈఓలను సర్దుబాటు చేయాలన్న దానిపై సమాలోచనలు చేశారు. మరో మూడు, నాలుగు రోజుల్లో ఎంపీఈఓలను తగిన స్థానాల్లో సర్దుబాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. అనంత జిల్లా పరిధిలోని 189 మంది ఎంపీఈఓల సర్దుబాటుపై డివిజన్ (మిగతా 6లో...)

దొరికింది.. పెద్ద చేప

ఏసీబీ వలలో కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్

రూ.5 లక్షలు తీసుకుంటూ దొరికిన నారాయణస్వామి



(వివరాలు 7లో)

అభివృద్ధి ప్రాజెక్టులకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్

(వివరాలు 7లో)

కసాపురానికి శ్రావణ శోభ

నెట్టికంటి దర్శనానికి పోటెత్తనున్న భక్తులు

(వివరాలు 6లో)

గడువు పొడిగింపు

సెలాఖరు దాకా వాతావరణ బీమా ప్రీమియం చెల్లించవచ్చు: జేడీఏ

(వివరాలు 6లో)

సంక్షోభ హాస్టళ్లు..!

మూసివేత దిశగా బీసీ సంక్షేమ వసతి గృహాలు

వేధిస్తున్న వార్డెన్ల కొరత

ఉన్న వారికి అదనంగా ఇన్‌చార్జి బాధ్యతలు

పర్యవేక్షణ గాలికి..

చేరేందుకు ఆసక్తి చూపని విద్యార్థులు

కొన్నింటిలో గణనీయంగా పడిపోయిన అడ్మిషన్లు



విద్యార్థులు చేరకపోవడంతో మూత దశకు చేరుకున్న కూడేరు బీసీ బాలికల హాస్టల్

అనంతపురం విద్య, జూలై 24(ఆంధ్రజ్యోతి):బీసీ సంక్షేమ వసతి గృహాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. వాటి పరిస్థితి నానాటికీ దిగజారుతోంది. వాటి నిర్వహణలో కీలకమైన వార్డెన్ల కొరత తీవ్రంగా ఉంది. ఉన్నవారికి పక్క హాస్టళ్ల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో సతమతమవుతున్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షణను గాలికొదిలేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థులు చేరడానికి అయిష్టత చూపుతుండడంతో హాస్టళ్లు మూతదశకు చేరుకుంటున్నాయి.

వార్డెన్ల కొరత

జిల్లాలో బీసీ సంక్షేమశాఖ లెక్కల ప్రకారం 55 వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో చిన్న పిల్లలకు 38, కళాశాల హాస్టళ్లు 17 ఉన్నాయి. ఒక్కో హాస్టల్‌కు ఒక్కో వార్డెన్ ఉండాలి. అపుడే పర్యవేక్షణ, హాస్టల్ నిర్వహణ సవ్యంగా సాగుతాయి. జిల్లాలో బీసీ సంక్షేమశాఖలో 21 మంది వార్డెన్ల కొరత ఉంది. 34 మంది మాత్రమే పనిచేస్తున్నారు. దీంతో ఒక్కో వార్డెన్‌కు ఇతర హాస్టల్ నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. ఇన్‌చార్జిలుగా అప్పగించారు. దీంతో వార్డెన్లు అక్కడా.. ఇక్కడా.. పర్యవేక్షణ చేయలేక, నెలనెలా బిల్లులు అందక నిర్వహణకు సతమతమవుతున్నారు.

కూడేరులో 20మందే..

సంక్షేమ వసతి గృహాల్లో పిల్లల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. గతంలో పిల్లలతో కిటకిటలాడుతూ కనిపించేవి. ప్రస్తుతం అందుకు విరుద్ధంగా దర్శనమిస్తున్నాయి. జిల్లాలో 38 చిన్నపిల్లల హాస్టళ్లలో 4,879 మంది మాత్రమే ఉన్నారు.

కూడేరు బాలికల హాస్టల్‌లో 20 మంది మాత్రమే ఉన్నారు. బెలుగుప్ప బాలుర హాస్టల్‌లో 33 మంది, ఆమిద్యాలలో 35 మంది, నూతిమడుగు బాలుర హాస్టల్‌లో 45 మంది మాత్రమే పిల్లలు ఉన్నారు. మరో 12 హాస్టళ్లలో 60 నుంచి వంద మంది లోపే ఉన్నారు. ఇవి కూడా మూతపడే ప్రమాదం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కాలేజీ హాస్టళ్లు ఫర్వాలేదు..

జిల్లాలో బీసీ కళాశాలల హాస్టళ్ల పరిస్థితి ఫర్వాలేదనిపిస్తోంది. అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో 17 కాలేజీ హాస్టళ్లు ఉన్నాయి. వాటిలో మొత్తంగా 2,620 మంది విద్యార్థులు ఉన్నారు. ఐదింటిలో 50 నుంచి వంద మందిలోపే విద్యార్థులు ఉన్నారు. ఉరవకొండ బాలికల కళాశాల హాస్టల్‌లో మాత్రం 18 మందే చేరారు.

రోజుకో హాస్టల్ పర్యవేక్షిస్తారు



వార్డెన్ల కొరత ఉన్న విషయం వాస్తవమే. 21 మందికి మరో హాస్టల్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాం. వీరందరూ ఒక్కోరోజు ఒక్కో హాస్టల్‌కు వెళ్లి పర్యవేక్షిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని హాస్టల్లలో పిల్లలు చేరడంలేదు. 50 మందిలోపు విద్యార్థులున్న హాస్టళ్లను సర్దుబాటు చేసే ఆలోచనలో ఉన్నాం. తద్వారా వార్డెన్లు, సిబ్బంది కొరత కొంతవరకు తగ్గే అవకాశం ఉంది.

\- ఖుష్బూకొఠారి, డీడీ, బీసీ సంక్షేమశాఖ

అత్యాచార కేసు నిందితులకు లైంగిక సామర్థ్య పరీక్షలు

అనంతపురం వైద్యం, జూలై 24(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలంలోని ఓ గ్రామంలో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో అరెస్టు అయిన నిందితులకు లైంగిక సామర్థ్య (పొటెన్సీ) పరీక్షలను నిర్వహించారు. అనంతపురం జిల్లా ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు నిందితులను పటిష్ట పోలీసు బందోబస్తు నడుమ గురువారం తీసుకువచ్చారు. బాలికను బెదిరించి, కొన్నాళ్లపాటు అత్యాచారానికి పాల్పడినట్లు 14 మందిపై కేసు నమోదైన విషయం తెలిసిందే. వీరు ధర్మవరం సబ్‌జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. నిందితులలో ముగ్గురికి కొన్నాళ్ల క్రితం లైంగిక సామర్థ్య పరీక్షలను నిర్వహించారు. మిగిలిన 11 మందిని గురువారం ఆస్పత్రికి తీసుకువచ్చారు. వీరిని పరీక్షించేందుకు వైద్యాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జనరల్ మెడిసిన్, యూరాలజీ, సర్జరీ, సైకియాట్రీ, రేడియాలజీ తదితర విభాగాలకు చెందిన వైద్యులు వీరిని పరీక్షించారు. నివేదికను పోలీసు అధికారులకు ఇచ్చారు. నిందితులలో ఒకరు మైనర్ కావడంతో అనంతపురం మెడికల్ కాలేజీలో కొన్ని ప్రత్యేక పరీక్షలను నిర్వహించారు.



వైద్య పరీక్షల అనంతరం నిందితులను జైలుకు తరలిస్తున్న పోలీసులు

అండగా ఉంటా.. వస్తావా..?

ఒంటరి మహిళకు వేధింపులు

ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

కళ్యాణదుర్గం/బ్రహ్మసముద్రం, జూలై 24(ఆంధ్రజ్యోతి): కేజీబీవీలో బాలికకు సీటు ఇప్పించే పేరిట వన్నూరు స్వామి అనే వ్యక్తి ఒంటరి మహిళను ట్రాప్ చేసే ప్రయత్నం చేశాడు. మొదట డబ్బులు అడిగి, ఆ తరువాత ఆమెను లోబరుచుకోవాలని ప్రయత్నించాడు. దీంతో ఆ మహిళ మాటలతోనే అతనికి బుద్ధి చెప్పింది. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నా, పోలీసులకు ఫిర్యాదు వెళ్లినా పట్టించుకోడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. భర్తను కోల్పోయిన ఓ మహిళ, తన ఇద్దరు కూతుళ్లలో కొన్నాళ్ల క్రితం పుట్టింటికి చేరుకుంది. కూలి పనులు చేస్తూ, తన బిడ్డలను, తల్లిదండ్రులను పోషిస్తోంది. పెద్ద కూతురును కేజీబీవీలో చేర్పిస్తే కొంత భారం తగ్గుతుందని భావించింది. బ్రహ్మసముద్రం కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తును సిద్ధం చేసుకుంది. ఈ విషయాన్ని తెలుసుకున్న బ్రహ్మసముద్రానికి చెందిన హెచ్.వన్నూరుస్వామి, ఆమెకు ఫోన్ చేశాడు. అన్ని విధాలుగా సాయం చేస్తానని నమ్మబలికి, రూ.10 వేలు ఇస్తే కేజీబీలో చేర్పిస్తానని బేరం పెట్టాడు. మరుసటి రోజు ఫోన్ చేసి, 'నీ కూతురుకు సీటు ఇప్పిస్తాను.. నా వద్దకు వస్తావా?' అని అసభ్యంగా మాట్లాడాడు. ఆగ్రహం వ్యక్తం చేసిన బాధితురాలు, అతని మాటలకు విసిగిపోయి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. జరిగిన సంఘటన గురించి ఆవేదన వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో వీడియోను పోస్టు చేసింది. కేజీబీవీలో సీట్లు ఇప్పిస్తామంటే ఎవరూ నమ్మవద్దని, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసినవారికి మాత్రమే ప్రవేశాలు కల్పిస్తామని ఎస్ఓ మహాలక్ష్మి అన్నారు. బయటి వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు.

భయం ఏదీ..?

పోలీసులపై తిరగబడుతున్న వైనం

మసకబారుతున్న ఖాకీ ప్రతిష్ట

చూసీచూడనట్లు ఉన్నతాధికారులు

కొన్ని చోట్ల వైసీపీ నాయకులదే హవా

సమాజం కట్టుతప్పకుండా ఉండాలంటే కాస్తోకూస్తో పోలీసుల భయం ఉండాలి. కానీ హిందూపురం నియోజకవర్గంలో కొన్ని అసాంఘిక శక్తులు పోలీసులపైనే తిరగబడి దాడి చేసేందుకు యత్నిస్తున్నాయి. అయితే ఏ కారణాల వలన కానీ పోలీసు ఉన్నతాధికారులు మాత్రం ఈ విషయాలను చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీనిపై సాధారణ ప్రజానీకం నుంచి విమర్శలు వినవస్తున్నాయి. - ఆంధ్రజ్యోతి, హిందూపురం



కొన్ని ఉదాహరణలు

● గత ఏడాది హిందూపురం మండలంలోని కర్ణాటక సరిహద్దుకు ఆనుకుని ఉన్న గ్రామంలో జాతర సందర్భంగా కొంతమంది యువకులు గొడవ పడ్డారు. ఇది గమనించి, అక్కడ విధుల్లో ఉన్న హోంగార్డ్ సర్ది చెప్పేందుకు వెళ్లగా తిరగబడి దాడి చేశారు.

● నాలుగు నెలల కిందట హిందూపురంలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న యువకులను హెచ్చరించడానికి వెళ్లిన ఓ కానిస్టేబుల్‌పై తిరగబడి (మిగతా 6లో..)

ఆగస్టు 15కి దత్తత పూర్తి కావాలి

సీఎస్ విజయానంద్ ఆదేశం

అనంతపురం కలెక్టరేట్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాల దత్తత లక్ష్యాన్ని ఆగస్టు 15 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కలెక్టర్, జిల్లా అధికారులను ఆదేశించారు. స్వర్ణాంధ్ర, పీ-4 ఫౌండేషన్, సిటీ గ్యాస్ పంపిణీ నెట్‌వర్క్ గురించి రాష్ట్ర సచివాలయం నుంచి గురువారం ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, ఇతర అధికారులు సమీక్షకు హాజరయ్యారు. లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలని, నీడ్ అసెస్మెంట్ సర్వేను ఆగస్టు 5వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో సుమారు 540 వరకు కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లను గుర్తించి, అన్ని శాఖలకు పంపించామని, అధికారులతో సమావేశమై లక్ష్యసాధనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ డాక్యుమెంట్ల అప్‌లోడ్, ఆర్టీజీఎస్ లెన్స్ ప్లాట్‌ఫాం గురించి వివరించారు.

బిల్లుకు రూ.10 వేలు

టెక్నికల్ అసిస్టెంట్ లంచావతారం

ఉన్నతాధికారుల పేరు చెప్పి దందా

పుట్లూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలో ఓ టెక్నికల్ అసిస్టెంట్ లంచావతారం ఎత్తాడు. ఉపాధి హామీ పనులకు సంబంధించి బిల్లు వచ్చిన ప్రతిసారి ఒక్కో పంచాయతీ నుంచి రూ.10 వేలు ఇవ్వాలని హుకుం జారీ చేసినట్లు సమాచారం. మండలంలో ఆ టెక్నికల్ అసిస్టెంట్ మేజర్ పంచాయతీలు తీసుకుని నకిలీ మస్టర్లను సృష్టించి సొమ్ము చేసుకుంటున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ఆ టెక్నికల్ అసిస్టెంట్‌పై కొందరు ఉన్నతాధికారులు నిఘా పెట్టినట్లు సమాచారం. మండలంలో 23 పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నా యి. మొత్తం 8877 జాబ్‌కార్డులు ఉండగా 891మంది కూలీలు ప్రస్తుతం పనులకు వెళుతున్నారు. మండలానికి నూతన ఏపీఓ వచ్చినా బిల్లులు మంజూరు చేయడంలో మాత్రం ఈ టెక్నికల్ అసిస్టెంటే కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. మండలంలో ఇప్పటికే సుమారు నాలుగు విడతలుగా కూలీలకు బిల్లులు మంజూరయ్యాయి. దీంతో ఆ టెక్నికల్ అసిస్టెంట్ ఒక్కో పంచాయతీకి రూ.5వేల నుంచి 10వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది.



ఏమొచ్చినా చూసుకుంటా..

'పంచాయతీల్లో జరిగిన ఉపాధిహామీ పనుల్లో ఏమైనా అవకతవకలు ఉంటే వాటిపై ఏమి వచ్చినా నేనే చూసుకుంటా' అంటూ ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆ టెక్నికల్ అసిస్టెంట్ భరోసా ఇస్తున్నట్లు తెలిసింది. మీరు ఏమైనా చేసుకోండి బిల్లులు పడినప్పుడు మాత్రం నేను అడిగిన మొత్తం ఇవ్వండి అని ఆదేశించినట్లు సమాచారం. దీంతో కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు తమ పంచాయతీల్లో ఎలాంటి అవకతవకలు జరగపోయినా డబ్బులు ఎందుకు ఇవ్వాలంటూ తమ తోటి వారితో అన్నట్లు సమాచారం. ఇప్పటికే ఆ టెక్నికల్ అసిస్టెంట్ రూ.3లక్షల మేర వసూలు చేశాడన్న ఆరోపణలు ఉన్నాయి.

ఉన్నతాధికారుల పేరిట..

ఉపాధిహామి పథకంలో ప్రతి ఒక్కరికి వాటా ఉంటుందంటూ ఆ టెక్నికల్ అసిస్టెంట్ ఉన్నతాధికారుల పేర్లు చెబుతూ వసూళ్లకు పాల్పడుతున్నాడనే విమర్శలు ఉన్నాయి. మండలానికి తాజాగా బదిలీపై వచ్చిన ఆ టెక్నికల్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ పరిధిలోనే కాకుండా డ్వామా కార్యాలయంలో సైతం అధికారులు తనకు తెలుసు అంటూ ప్రగల్భాలు పలుకుతూ బిల్లులు చేస్తున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. వచ్చిన అనతికాలంలోనే పెద్దఎత్తున నకిలీ మస్టర్లు సృష్టించినట్లు తెలిసింది. తాడిపత్రి పట్టణానికి చుట్టుపక్కల మండలాల్లోనే బదిలీ అవుతూ ఫెవికాల్ ఉద్యోగిగా ముద్రపడ్డాడన్న విమర్శలు ఉన్నాయి. ఎంపీడీఓ కార్యాలయంలో కొందరు అధికారులను బేఖాతరు చేస్తూ ఇష్టమొచ్చిన రీతిలో వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. కార్యాలయంలోని కంప్యూటర్ సిబ్బందిని సైతం తన కనుసన్నల్లో ఉంచుకున్నట్లు తెలుస్తోంది. మస్టర్లలో ఎలాంటి పేర్ల మార్పిడి చేయాలన్నా, సంతకాలు చేయాలన్నా అతడి అనుమతి ఉండాల్సిందే. ఈ లంచావతారం దెబ్బకు పనులు చేసిన ఉపాధి కూలీలకు అరకొరగానే బిల్లులు అకౌంట్‌లో పడుతున్నట్లు తెలిసింది.

నా దృష్టికి రాలేదు: అలివేలమ్మ, ఎంపీడీఓ

ఉపాధిహామీలో బిల్లులకు సంబంధించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు నా దృష్టికి రాలేదు. ఎవరైనా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదుచేస్తే సంబంధిత అధికారిపై చర్యలు తీసుకుంటాం. పనులకు వచ్చిన కూలీలకు మాత్రమే మస్టర్లలో హాజరువేయాలని సూచించాం.

ఎనిమిది మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎనిమిది మండలాల్లో బుధవారం వర్షం కురిసింది. అత్యధికంగా కుందుర్పిలో 19.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. పెద్దవడుగూరు మండంలో 7.6, గుత్తి 7.4, గుంతకల్లు 7.2, యాడికి 6.4, కళ్యాణదుర్గం 5.0, తాడిపత్రి 3.0, అనంతపురం నగరంలో ఒక మి.మీ. వర్షపాతం నమోదైంది.

కుక్కలతో జనం బెంబేలు



కుక్కలతో అనంతపురం నగర వాసులు ఆందోళన చెందుతున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో సుమారు 50వేలకు పైగా కుక్కలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. నగరంలో రోజురోజుకు కుక్క కాటు బాధితులు పెరుగుతున్నారు. వాహనదారులు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, చిన్నారులు వీధుల్లో భయపడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. ఒక్కోసారి 10-15 కుక్కలు వీధుల్లో సంచరిస్తూ భయానక పరిస్థితులను సృష్టిస్తున్నాయి. కొన్ని వీధుల్లో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని నడవాల్సిన పరిస్థితి వస్తోంది. ఇంతటి భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్న కుక్కలను నియంత్రించడం, తరలించడంలో నగరపాలక సంస్థ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న విమర్శలు వస్తున్నాయి. నగరంలో అనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) టీకాను ఉపయోగించి కుక్కలను నియంత్రించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలుస్తోంది.



వృద్ధులపై దాడి చేస్తున్న శునకాలు



వాహనదారుడిపైకి ఎగబడుతున్న కుక్క

నగరంలో 50వేలకు పైగా శునకాలు

నియంత్రణ చర్యలు శూన్యం

పెరిగిపోతున్న కుక్కకాటు బాధితులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అనంత నగరపాలక సంస్థలో కుక్క కాటు బాధితులు రోజురోజుకు పెరిగిపోతున్నారు. హౌసింగ్‌బోర్డులో ఇటీవల ఓ వ్యక్తి ఫిల్టర్ నీళ్ల కోసం వెళ్లిన సమయంలో కుక్క కాటుకు గురయ్యాడు. రామ్‌నగర్‌లో ఫ్రిజ్ రిపేరీ కోసం వెళ్లిన ఓ మెకానిక్‌ని రెండు నెలల క్రితం కుక్క కరిచిన దెబ్బతో నేటికీ నొప్పి తగ్గలేదని వాపోతున్నాడు. రామచంద్రనగర్‌లో ఓ చిన్నారి అంగడికి వెళ్లి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో కుక్క కాటుకు గురైంది. ఇలా నగరంలో రోజురోజుకి కుక్క కాటు బాధితులు పెరిగిపోతున్నారు.

కుక్క కాటుకు ప్రథమ చికిత్స

కుక్కకాటుకు శస్త్రచికిత్స గాయం తీవ్రతపై ఆధారపడి ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. చిన్న కాట్లకు సబ్బు, నీటితో కడగడం, యాంటీ బయోటిక్ లేపనం, శుభ్రమైన కట్టుతో కప్పడం వంటి ప్రాథమిక చికిత్స సరిపోతుంది. పెద్ద కాట్లకు వైద్యసంరక్షణ అవసరం ఉంటుంది. ఇందులో కుట్లు, యాంటీ బయోటిక్స్ లేదా రేబీస్ లేదా టాటానస్ టీకాలు వంటివి అందుబాటులో ఉన్నాయి. కుక్క కాటు తర్వాత ఏవైనా ఇన్‌ఫెక్షన్ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

ప్రభుత్వం అనుమతిస్తే ఏబీసీ కేంద్రం ఏర్పాటు



నగరంలో కుక్కల బెడద ఉన్న మాట వాస్తవమే. వీధి, పెంపుడు కుక్కలు నగరంలో రోజురోజుకు పెరిగిపోతున్నాయి. గతంలో కుక్కలు పట్టి తరలించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతిస్తే కుక్కలను నియంత్రించవచ్చు. కుక్కల సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఉన్నతాధికారులకు పంపించాం. జంతుసంక్షేమ సంస్థల ఫిర్యాదుతో కుక్కలను పట్టకూడదని, ఏబీసీ టీకా వినియోగించరాదని ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వం అనుమతిస్తే ఏబీసీ సెంటర్ ఏర్పాటు చేయవచ్చు.

- రంగస్వామి, ఎంహెచ్‌ఓ

కసాపురానికి శ్రావణ శోభ

నెట్టికంటి దర్శనానికి పోటెత్తనున్న భక్తులు

శనివారాల్లో వాహనసేవలు

మంగళవారాల్లో వెండి రథోత్సవాలు



నెట్టికంటి ఆంజనేయస్వామి విరాట్టు

గుంతకల్లు, జూలై 24(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం ప్రారంభం కానుండగా కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానం నెలరోజులపాటు శోభాయమానం కానుంది. ఆంజనేయ స్వామి భక్తులు వేయి కన్నులతో ఎదురు చూసే శ్రామణ మాసం శుక్రవారం ప్రారంభం కానుంది. శ్రావణ మాసం ప్రారంభమైన మరుసటిరోజే తొలి శనివారం. దీంతో నెలలో ఐదు శనివారాల్లో ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. నాలుగు మంగళవారాల్లో కూడా ప్రత్యేక పూజలు, స్వామివారికి విశేష అలంకారాలు చేయనున్నారు. ఈ తొమ్మిది రోజుల్లో జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాలు, కర్ణాటక, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి కూడా వేలాదిగా భక్తులు తరలి రానున్నారు.

వేలాదిగా రానున్న భక్తులు

శ్రావణ మాసంలోని మంగళ, శనివారాల్లో ఒకేరోజు జిల్లాలోని కసాపురం, నేమకల్లు, మురడి గ్రామాలలోని ఆంజనేయస్వామి దేవస్థానాలను సందర్శించి, మొక్కులను తీర్చుకుంటారు. శనివారాల్లో కసాపురం ఆంజనేయ స్వామి దేవస్థానానికి వేలాదిగా భక్తులు తరలివచ్చి ఉత్సవ కార్యక్రమాల్లో పాల్గొంచుకుంటారు. ఈసారి చివరిదైన ఐదో శనివారం అమావాస్య కావడంతో ఆరోజు భక్తులు నిదుర చేయడానికి పెద్దసంఖ్యలో తరలిరానున్నారు. భక్తులకు వసతి, రద్దీ నియంత్రణ, ప్రసాద వితరణ, అన్నదానం, వైద్యం, తాగునీటి సదుపాయాల కల్పనకు ఆలయ అధికారులు శుక్రవారం సమీక్ష నిర్వహించనున్నారు. ఉత్సవ దినాలలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటం కారణంగా ఆలయంలో ప్రదక్షిణను రద్దు చేయనున్నట్లు ఈఓ వాణి తెలిపారు. ఉత్సవాల్లో భక్తులను తరలించేందుకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆధ్వర్యంలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది. గతేడాది గుంతకల్లు నుంచి కసాపురానికి ఎమ్మెల్యే సొంత ఖర్చుతో ఉచిత బస్సులను నడిపారు.

ఉత్సవ కార్యక్రమాలు ఇలా..

- జూలై 26వ తేదీ మొదటి శనివారం సీతారామ సహిత ఆంజనేయ స్వామికి శేషవాహనోత్సవం
- ఆగస్టు 2: స్వామివార్లకు హనుమద్ వాహనోత్సవం
- ఆగస్టు 9: స్వామివార్లకు గజ వాహనోత్సవం
- ఆగస్టు 16: స్వామివార్లకు గరుడ వాహనోత్సవం
- ఆగస్టు 23: ఒంటె వాహనోత్సవం
- జూలై 29, ఆగస్టు 5, 12, 19, తేదీల్లో నాలుగు మంగళవారాల్లో స్వామివార్లకు వెండి రథోత్సవం నిర్వహిస్తారు.

ఏమిటో అతగాడి ధైర్యం..?

డీపీఓలో ఓ డిజిటల్ అసిస్టెంట్ బరితెగింపు

సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో అక్రమాలు

చూసీచూడనట్లుగా ఉంటున్న ఉన్నతాధికారి



అనంతపురం న్యూటౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఓ డిజిటల్ అసిస్టెంట్ బరితెగించి వ్యవహరిస్తుండటంతో జిల్లా పంచాయతీ కార్యాలయం(డీపీఓ)లో ఏమి జరుగుతోందో అర్థం కాని పరిస్థితి నెల కొంది. డిజిటల్ అసిస్టెంట్ల బదిలీల్లో భాగంగా ఆ డిజిటల్ అసిస్టెంట్‌తో పాటు మరో గుమస్తా చేతులు కలిపి ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న ప్రచారం ఉంది. ఆ డిజిటల్ అసిస్టెంట్ డీపీఓ పేరుతో తనకు కావాల్సిన వారికి, ముడుపులు ముట్టచెప్పిన వారికి ఎక్కడికి కావాలంటే అక్కడికి బదిలీ చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గిట్టని వారికి చుక్కలు చూపించినట్లు ప్రచారం జరుగుతోంది. కింగ్‌పిన్‌గా చెప్పుకుంటునన ఆ డిజిటల్ అసిస్టెంట్ ఆత్మకూరు మండలం నుంచి అనంతపురం రూరల్‌కు బదిలీ చేయించుకున్నారు. ఇది ఎలా సాధ్యమో డీపీఓకే తెలియాలి. ఇదే మార్గంలో మరికొందరు ఉన్నారు. ఇక గిట్టని వారికి సంబంధించి... గత ఎడాదే అనిల్‌కుమార్ అనే డిజిటల్ అసిస్టెంట్ బదిలీపై రాజీవ్‌కాలనీ పంచాయతీకి వచ్చారు. కొద్దిరోజులు డీపీఓ, కలెక్టరేట్‌లో కూడా డెప్యుటేషన్‌పై పని చేశారు. ఆయన పేరు బదిలీలో లేకపోయినా, తన తల్లికి ఆరోగ్య సమస్యలు ఉన్నాయని చెప్పినా దూరంగా ఉన్న బెళుగుప్పకు పంపే ప్రయత్నం చేశారు. దీనిపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేయడంతో 'మీరు బెళుగుప్పకు వెళ్లినా సమస్య ఏముంటుంది? ఎలాగూ తిరిగి డెప్యుటేషన్‌పై కలెక్టరేట్‌లోనే కదా పని చేసేది' అని ఉచిత సలహా ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఆ డిజిటల్ అసిస్టెంట్ ఆక్రోశం భరించలేక 'మీరేందుకు ఆత్మకూరు నుంచి కందుకూరు వేయించుకున్నారు. మీరు కూడ డీపీఓ కార్యాలయంలోనే కదా డెప్యుటేషన్‌పై చేసేది మీరు బెళుగుప్ప ఎందుకు వేయించుకోలేదని డీపీఓ ఎదుటే ప్రశ్నించినట్లు తెలిసింది. దీన్ని విన్న డీపీఓ నాగరాజనాయుడు ఖంగుతిన్నట్లు సమాచారం. దీంతో ఇక్కడ ఉన్న సీసీల్లో ఎవరినైన అవసరం అయితే మరోప్రాంతానికి వేసి అయిన నీకు అన్యాయం జరగకుండా చూస్తానని డీపీఓ హామీ ఇచ్చినట్లు సమాచా రం. ఈ పరిణామాలు గమనిస్తే డిజిటల్ అసిస్టెంట్ ఏ స్థాయిలో చెలరేగిపోతున్నాడో అర్థం చేసుకోవచ్చు. బదిలీల కౌన్సెలింగ్‌లో భాగంగా అభ్యర్థులు రాసుకున్న ప్లేస్‌మెంట్స్‌ను కూడా మార్చినట్లు ప్రచారం ఉంది. దీంతో పాటు కలెక్టర్ ఆమోదం పొంది వచ్చిన జాబితాలో కూడా పెద్ద ఎత్తున మార్పులు, చేర్పులు చేసి కలెక్టర్‌ను, డీపీఓను బురిడీ కొట్టించారన్న ప్రచారం జరుగుతోంది. ఇక మన పని అయిపోయింది. ఇక్కడే ఉంటే సమస్యల్లో పడే అవకాశం ఉంది. డెప్యుటేషన్ రద్దు చేయించుకుని, ఇక్కడి నుంచి జారుకుంటే బెటరని ఆ డిజిటల్ అసిస్టెంట్ తన సన్నిహితుల వద్ద చెప్పినట్లు సమాచారం. ఇంత తతంగం జరుగుతున్నా డీపీఓ నాగరాజనాయుడు మాత్రం ఏమి పట్టించుకోకుండా ఉంటున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

అభివృద్ధిలో ఆదర్శం

- జాతీయ స్థాయికి గొట్లూరు ప్రగతి
- ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపిక

హర్ ఘర్ జల్, ఓడీఎఫ్, చెత్తసేకరణలో ముందడుగు

స్వాతంత్ర్య వేడుకలకు సర్పంచ్‌కు ఆహ్వానం

స్వచ్ఛ భారత్‌లో జిల్లాలోనే ఆదర్శ గ్రామం



కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో గొట్లూరు పంచాయతీ

గ్రామ పంచాయతీ స్వరూపం

మొత్తం జనాభా : 4,678

పురుషులు : 2,372

స్త్రీలు : 2,306



గొట్లూరు గ్రామ ముఖద్వారం

ధర్మవరం రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరును ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేసి, సర్పంచ్ పిట్టా నరసమ్మను ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవానికి రావాలని కేంద్ర ప్రభుత్వం ఆహ్వానం పంపింది. దేశ వ్యాప్తంగా పలు విభాగాల్లో ఉత్తమ గ్రామ పంచాయతీలను ఎంపిక చేశారు. మన రాష్ట్రంలో మూడు పంచాయతీలను ఎంపిక చేయగా అందులో గొట్లూరు ఒకటి కావడం గమనార్హం. హర్‌ఘర్‌జల్(ఇంటింటికి తాగునీరు), ఓడీఎఫ్ (బహిరంగ మలవిసర్జన రహిత గ్రామం), చెత్త సేకరణ కేంద్రం నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరచడంతో గొట్లూరు ఉత్తమ పంచాయతీగా ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. జాతీయ స్థాయిలో తమ గ్రామం పేరు రావడం పట్ల సర్పంచ్‌తో పాటు పంచాయతీ సెక్రటరీ గణేష్, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానం నుంచి ఆదర్శం వైపు

వైసీపీ పాలనలో గ్రామంలో చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని వాడుకలోకి తేకుండా వదిలేశారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో రూ.4లక్షల వ్యయంతో ఆ కేంద్రానికి మరమ్మతులు చేయించి వాడుకలోకి తెచ్చారు. ప్రజల భాగస్వామ్యంతో ప్రతిరోజు పంచాయతీలో పారిశుధ్య కార్మికులు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించి, కేంద్రానికి తరలిస్తున్నారు. అక్కడ చెత్తను తడి, పొడిగా విభజించి తొట్టెల్లో వేసి ఎరువుగా తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇలా వచ్చిన నగదును పంచాయతీ అభివృద్ధికి వాడుకుంటున్నారు. ఈ కేంద్రం ప్రస్తుతం జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తోంది. ధర్మవరం డివిజన్ స్థాయిలో చెత్తసేకరణ కేంద్రాలపై ఇక్కడే సిబ్బందికి, కార్మికులకు శిక్షణ కూడా ఇస్తున్నారు. ప్రస్తుతం ఈ కేంద్రం గ్రామాభివృద్ధికి ఆదర్శంగా నిలుస్తోంది.



చెత్త సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు

ఇంటింటికీ తాగునీరు

హర్‌ఘర్ జల్ పథకంతో గ్రామంలో ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తున్నారు. సుమారు రూ. 24లక్షల వ్యయంతో పైపులైన్లు, తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి తాగునీరు సరఫరా చేస్తున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు.

బహిరంగ మలవిసర్జన రహిత గ్రామం

ఇంటింటికి మరుగుదొడ్డి ఏర్పాటుతో బహిరంగ మలవిసర్జన రహిత గ్రామంగా గొట్లూరు ఆవిర్భవించింది. ఐహెచ్‌ఎల్ పథకంతో గ్రామంలో ప్రతి ఇంటివద్ద మరుగుదొడ్డిని ప్రజలు ఏర్పాటు చేసుకున్నారు.



గ్రామంలో పరిశుభ్రంగా ఉన్న ప్రధానవీధి

చేపట్టిన అభివృద్ధి పనులు

- రూ.1.10కోట్లతో సీసీరోడ్ల ఏర్పాటు
- 90లక్షలతో మురుగు కాలువల ఏర్పాటు
- రూ.2.37లక్షలతో జడ్పీ హైస్కూల్లో కిషన్‌షెడ్ కోసం
- రూ.40 లక్షలతో సచివాలయ భవన నిర్మాణం
- రూ.20 లక్షలతో రైతుసేవా కేంద్రం ఏర్పాటు
- రూ.9లక్షలతో ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణం
- రూ. ఆరులక్షలతో ఈద్గా కాంపౌండ్ వాల్ నిర్మాణం

గతంలోనూ అవార్డులు

గొట్లూరు పంచాయతీకి గతంలోనూ నాలుగు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అవార్డులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. స్వచ్ఛభారత్, గ్రామాభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు అందజేసినట్లు తెలిపారు. అప్పట్లో కూడా జాతీయ, రాష్ట్రస్థాయిలో గొట్లూరును ఎంపికచేసి అప్పటి గ్రామ సర్పంచ్ శివయ్యకు అవార్డులు అందజేసినట్లు రికార్డులు ఉన్నాయి.

పశువులు.. పక్షులకు శ్మశాన వాటిక

గ్రామంలో మనుషులకే కాకుండా పశువులు, పక్షులకు కూడా శ్మశాన వాటిక ఏర్పాటు చేశారు. పశువులు, పక్షులు చనిపోతే వాటిని ఎక్కడపడితే అక్కడ ఖననం చేయకుండా, వాటికోసం ప్రత్యేకంగా శ్మశానవాటికను ఏర్పాటు చేశారు. దీంతో ఆ గ్రామానికి వచ్చిన వారు దాన్ని చూసి అభినందిస్తున్నారు.

ఆనందంగా ఉంది



మా గ్రామాన్ని ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేయడం ఆనందంగా ఉంది. స్వాతంత్ర్య దినోత్సవానికి ఢిల్లీకి రావాలని ఆహ్వానం పంపారు. మా గ్రామ అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేశాం. గ్రామ పంచాయతీ, మండల అధికారుల సమన్వయం, మా గ్రామప్రజల భాగస్వామ్యంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకున్నాం. మంత్రి సత్యకుమార్‌యాదవ్ మా గ్రామం కోసం సీసీరోడ్లు, తదితర వాటిని మంజూరు చేయించారు. అభివృద్ధికి సహకరించిన మంత్రి, రాష్ట్ర ప్రభుత్వానికి మా గ్రామ ప్రజల తరపున ధన్యవాదలు.

- పిట్టా నరసమ్మ, గ్రామసర్పంచ్, గొట్లూరు



ఇంటింటి చెత్తసేకరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్, గ్రామ సెక్రటరీ

భయం ఏదీ..?

(5వ పేజీ తరువాయి)

దాడికి యత్నించారు. ఆయన ఎలాగో తప్పించుకుని బయటపడ్డాడు.

- ఆరు నెలల కిందట కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై తీసుకెళ్తుండగా హిందూపురం సర్కిల్‌లోని ఓ పోలీ స్టేషన్‌లో పనిచేసే హెడ్‌కానిస్టేబుల్ పట్టుకునేందుకు ప్రయత్నించారు. అయితే ఆ యువకులు అతడిపై రాళ్లు రువ్వారు. దీంతో ఆయన వారి బారి నుంచి తప్పించుకోవడానికి పారిపోవాల్సి వచ్చింది.
- తాజాగా హిందూపురంలోని రహమత్‌పురం ప్రాంతంలో విధుల్లో ఉన్న పోలీసులపై దాడికి యత్నించారు. అయితే ఇంత జరిగినా పోలీసు అధికారులు గోప్యంగా ఉంచారు. పత్రికల్లో రావడంతో స్పందించి పోలీసులపై తిరగబడిన వ్యక్తిని అరెస్ట్ చేశారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలో ఓ వ్యక్తి ఏఎస్ఐపై తిరగబడి ద్విచక్రవాహనంతో ఢీకొట్టడానికి ప్రయత్నించాడు.

పోలీసులంటే లెక్కేలేదు

హిందూపురం సబ్‌డివిజన్‌లో పోలీసుల ప్రతిష్ఠ మసకబారుతోంది. కొన్ని అసాంఘిక శక్తులు, అడ్డదారుల్లో డబ్బు సంపాదించేవారు ఏమాత్రం భయం లేకుండా పోలీసులపైనే తిరగబడుతున్నారు. దీంతో ఇక తమనేం రక్షిస్తారంటూ సామాన్యుల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. హిందూపురం సబ్‌డివిజన్‌లో వైసీపీ నాయకులు, సానుభూతిపరులు ఇప్పటికీ పోలీసులపై తిరగబడుతున్నారు. గత ఐదేళ్లలో విచ్చలవిడిగా వ్యవహరించిన ఆ పార్టీ నాయకులు ప్రభుత్వం మారినా కొందరిలో మార్పు రాలేదు. దీంతో ఇప్పటికీ పోలీసులంటే లెక్క లేకుండా ప్రవర్తిస్తున్నారు.

టీడీపీ అధిష్టానానికి ఫిర్యాదు

ఇటీవల పట్టణంలోని ఓ పోలీస్ స్టేషన్‌లో పలు కేసులున్న వైసీపీ నాయకుడు అక్కడున్న అధికార పార్టీ నాయకులపైనే తిరగబడ్డాడు. అయినా పోలీసు అధికారులు మిన్నకుండిపోయారు. వైసీపీ పాలన అంతం అయ్యి ఏడాది గడిచినా, ఇప్పటికీ కొంతమంది వైసీపీ నాయకులకు పోలీసులు వత్తాసు పలుకుతున్నారని పార్టీ అధిష్టానం, ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి టీడీపీ నాయకులు తీసుకెళ్లినట్లు సమాచారం. గత ప్రభుత్వ పాలనలో పని చేసిన పోలీసులు, సిబ్బంది ఉండటంతోనే ప్రస్తుతం వైసీపీ నాయకుల మాటే చెల్లుబాటు అవుతోందని, తమ ప్రభుత్వం వచ్చినా, అన్యాయమే జరుగుతోందంటూ ప్రతి రోజూ ఎవరో ఓ కార్యకర్త ఎమ్మెల్యే కార్యాలయంలో గోడు వెల్లబోసుకుంటున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గంలో టీడీపీ నాయకులు నోరు విప్పడానికి జంకారు. కొంతమంది ముఖ్య నాయకులే పార్టీ పిలుపునిచ్చిన నిరసన కార్యక్రమాలకు రావడానికి జంకారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడానికి కూడా టీడీపీ నాయకులు వెళ్లడానికి భయపడేవారు. అలాంటిది కొత్త ప్రభుత్వం వచ్చిన ఏడాది తరువాత కూడా వైసీపీ నాయకులు దర్జాగా వెళ్లి పోలీస్‌స్టేషన్‌లో పంచాయతీలు, దందాలు చేస్తున్నారు. ఇందుకు కొంతమంది పోలీసు అధికారులు కూడా ఆ పార్టీ నాయకులకు అండగా నిలుస్తున్నారని ఆరోపణలు బలంగా ఉన్నాయి. వైసీపీ నాయకులను ఇలాగే వదిలేస్తే వచ్చే స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వస్తుందని కూటమి నాయకులే బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్నారు.

గడువు పొడిగింపు

నెలాఖరుదాకా వాతావరణ బీమా ప్రీమియం చెల్లించవచ్చు: జేడీఏ

అనంతపురం అర్బన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వాతావరణ బీమా ప్రీమియం చెల్లింపు గడువును ఈనెలాఖరు దాకా పొడిగించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వరకే ఉన్న గడువును జిల్లాలో నెలకొన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పొడిగించారన్నారు. వాతావరణ ఆధారిత బీమాను వేరుశనగ, పత్తి, దానిమ్మ, చీనీ, టమోటా, అరటి పంటలకు వర్తింపజేశారన్నారు. ఆయా పంటలను మండల యూనిట్‌గా పరిగణించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లాలో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తారన్నారు.

వాతావరణ ఆధారిత బీమా ప్రీమియం వివరాలు..

పంట	బీమా మొత్తం (హెక్టారుకు)	రైతు వాటా ఎకరాకు	హెక్టారుకు	గడువు
వేరుశనగ	80000	640	1600	జూలై 31
పత్తి	95000	1140	1600	జూలై 31
దానిమ్మ	187500	3750	9375	జూలై 31
చీనీ	137500	2750	6875	జూలై 31
టమోటా	80000	1600	4000	జూలై 31
అరటి	150000	3000	7500	జూలై 31

పారిపోయిన హాస్టల్ విద్యార్థులు

పోలీసులకు ఫిర్యాదు చేసిన వార్డెన్



బాబు



నవదీప్



కె. మణికంఠ



ఎస్. మణికంఠ

అనంతపురం క్రైం, జూలై 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని బీసీ హాస్టల్‌లో ఉంటూ, పొట్టిశ్రీరాములు పాఠశాలలో చదువుకుంటున్న నలుగురు విద్యార్థులు పారిపోయారు. పాఠశాలలో హెచ్‌ఎం మందలించినందుకు వారు ఇలా చేశారని అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. పారిపోయినవారిలో పదో తరగతి విద్యార్థులు ఇద్దరు, తొమ్మిది, ఎనిమిదో తరగతి విద్యార్థులు ఒక్కొక్కరు ఉన్నారు. ఉదయం పాఠశాలకు వెళ్లి విద్యార్థులు సాయంత్రమైనా హాస్టల్‌కు చేరలేదు. దీంతో వార్డెన్ మస్తాన్ మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, విద్యార్థుల కోసం గాలిస్తున్నామని త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు. నార్పల మండలం నడిమిదొడ్డికి చెందిన నాగప్ప కుమారుడు బాబు(14), కూడేరు మండలం అరవకూరుకు చెందిన చంద్రశేఖర్ కుమారుడు నవదీప్(14), గోరంట్ల మండలం తోటవమాకులపల్లికి చెందిన శేషాద్రి కుమారుడు కె.మణికంఠ(13), గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన విక్రాంత్ కుమారుడు ఎస్.మణికంఠ(12) అదృశ్యమయ్యారు. వీరంతా 3వ రోడ్డులోని బీసీ హాస్టల్ నంబర్ 2లో ఉంటూ, పొట్టి శ్రీరాములు పాఠశాలలో చదువుకుంటున్నారు. పాఠశాలకు సక్రమంగా హాజరు కావడం లేదని, టీసీ ఇచ్చి పంపుతామని హెచ్‌ఎం శ్రీదేవి మందలించారని, ఈ కారణంగానే విద్యార్థులు వెళ్లిపోయి ఉండవచ్చని వార్డెన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యార్థులు అదృశ్యమైన విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేశామని పేర్కొన్నారు. ముగ్గురు పిల్లలు స్కూల్ యూనిఫాం ధరించారని, విద్యార్థి బాబు పింక్ షర్ట్, నలుపు రంగు ప్యాంటు వేసుకున్నారని వివరించారు.

ఎట్టకేలకు..!

(5వ పేజీ తరువాయి)

వారిగా ఆయా ఏడీఏలతో జేడీఏ చర్చించి, జాబితాను సిద్ధం చేశారు.


నిబంధనలు పాటించని శ్రీసత్యసాయి

క్రమబద్ధీకరణ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం ఆధారంగా ఆయా ప్రాంతాల్లోని రైతు సేవా కేంద్రాలకు ఆయా శాఖల రైతు సేవా కేంద్రం సిబ్బంది, ఎంపీఈఓల స్థానాలను ఇదివరకే కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో 323 మంది ఎంపీఈఓలు విధులు నిర్వర్తిస్తున్నారు. అనంత జిల్లాలో 189 మంది ఎంపీఈఓలు పని చేస్తుండగా.. 133 మందిని రైతు సేవా కేంద్రాలకు కేటాయించారు. మిగిలిన 56 మందిని పంటల విస్తీర్ణం ఎక్కువ కలిగిన ప్రాంతాల్లో నియమించాల్సి ఉంది. శ్రీసత్యసాయి జిల్లాలో 134 మంది ఎంపీఈఓలు ఉండగా.. 80 మందిని రైతు సేవా కేంద్రాలకు కేటాయించారు. మిగిలిన 54 మందిని పంటల సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నియమించాల్సి ఉంది. నిబంధనల మేరకు ఉమ్మడి జిల్లాకు సంబం ధించి అనంత జేడీఏ కార్యాలయంలోనే ఎంపీఈఓల సర్దుబాటుకు సమాలో చనలు జరపాల్సి ఉంది. అయితే శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన జేడీఏ, ఏడీఏలు సమావేశానికి హాజరుకాలేదు. శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న ఎంపీఈఓల సర్దుబాటుకు ఇప్పటి దాకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సమాచారం. శ్రీసత్యసాయి జిల్లా వ్యవసాయ కార్యాలయంలో తమ జిల్లాకు చెందిన ఎంపీఈఓల సర్దుబాటు జాబితాను తయారు చేసుకుంటామని చెప్పినట్లు సమాచా రం. దీనిపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లా నుంచి అనంత జిల్లాకు.. అక్కడి నుంచి శ్రీసత్యసాయి జిల్లాకు వెళ్లేందుకు కొందరు ఎంపీఈఓలు మ్యూచ్‌వల్‌గా విన్నవించారు. ఉమ్మడి జిల్లాకు సంబం ధించి అనంత జేడీఏ కార్యాలయంలో ఒకే సారి ఎంపీఈఓల సర్దు బాటుపై జాబితాను తయారు చేసి ఉంటే.. స్థానాల కేటాయింపులపై సమస్యలు ఉండవని, శ్రీసత్యసాయి జిల్లా యంత్రాంగం వేరుగా జాబితా తయారు చేసుకుంటే స్థానాల కేటాయింపుల్లో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కంప్యూటర్ ఆపరేటర్ ఆత్మహత్య

ధర్మవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోతుకుంట బ్రిడ్జి కింద మారుతీనగర్‌కు చెందిన మంచిరెడ్డి మోహన్‌రెడ్డి(45) గురువారం సాయంత్రం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు హిందూపురం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు మృతుడు మోహన్‌రెడ్డి నల్లమాడ ఎమ్మార్సీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేసేవాడు. ఈయన మూడు నెలల కిందటే నల్లమాడకు వెళ్లారు. మంగళవారం పని నిమిత్తం ధర్మవరం వచ్చాడు. ఏం జరిగిందో ఏమో కానీ పోతుకుంట బ్రిడ్జి వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కీమెన్ సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య మాధవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపారు.

సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తులు



సైబర్ నేరగాళ్లు చేసిన ఫోన్ నంబర్లు

బొమ్మనహాళ్, జూలై 24(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు డబ్బు దోపిడీకి కొత్త ఎత్తులు వేస్తున్నారు. వెలుగు కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామనీ, ఫోన్ పే ఓపెన్ చేయాలంటూ ఓ మాజీ సర్పంచ్‌కే మోసం చేయాలని ప్రయత్నించారు. ఆయన అప్రమత్తమవడంతో తప్పించుకున్నాడు. మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ మాజీ సర్పంచ్ మారుతీప్రసాద్‌ను గతేడాది సైబర్ నేరగాళ్లు మోసం చేసి, రూ.25 వేలు కొట్టేశారు. తాజాగా గురువారం 9991517668 నంబర్ నుంచి మారుతీప్రసాద్ ఫోన్‌కు కాల్ వచ్చింది. 'మీ అమ్మకు పెన్షన్ వచ్చిందనీ, బ్యాంకు లింక్ లేదనీ, మీ అకౌంట్‌కు వేస్తామనీ, ఖాతా నంబరు చెప్పాల'ని అడిగారు. వారి మాటలు నమ్మి మారుతీప్రసాద్ బ్యాంకు ఖాతా నంబర్ చెప్పారు. డబ్బు బదిలీ కావట్లేదనీ, ఫోన్ పేకి వేస్తామనీ, ఓపెన్ చేసుకోవాలన్నారు. మారుతీప్రసాద్‌కు అనుమానం వచ్చి మందలించి ఫోన్ కట్ చేశాడు. విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసుల విచారణలో సైబర్ నేరగాళ్ల నంబర్‌గా తేలింది. అకౌంట్‌లోని నగదును ట్రాన్స్‌ఫర్ చేసుకోవాలని పోలీసులు సూచించారు. గతంలో కూడా సైబర్ ఉచ్చులో పడి రూ.25 వేలు పోగొట్టుకున్నట్లు బాధితుడు మారుతిప్రసాద్ తెలిపారు.

భక్తులకు గమనిక..!

రేపటి నుంచి మంత్రాలయానికి కొత్త బస్సు సర్వీసు

ధర్మవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ధర్మవరం డిపో నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయానికి కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలోతెలిపారు. ఈ సర్వీసు ఈనెల 26న ఉదయం 5-15గంటలకు ప్రారంభిస్తామన్నారు. ఈ బస్సు అనంతపురం, గుత్తి, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు మీదుగా మంత్రాలయానికి 11గంటలకు చేరుకుంటుందన్నారు. తిరిగి మంత్రాలయంలో 11-30గంటలకు బయలుదేరి సాయంత్రం 5-15గంటలకు ధర్మవరం చేరుకుంటుందన్నారు.

చదువుతో అసమానతలు దూరం

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



విద్యార్థినికి నగదు పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

అనంతపురం టౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): చదువుతోనే సమాజంలో అసమానతలు దూరమవుతాయని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన తొగట వీర క్షత్రియ విద్యార్థులకు గురువారం స్థానిక బెంగళూరు రోడ్డులోని తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో నగదు పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ.. చేనేత కులాలకు చెందిన ఎంతోమంది పిల్లలు ఉన్నత చదువులు చదివి వివిధ రంగాల్లో రాణిస్తున్నారన్నారు. పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని తెలిపారు. అనంతరం ఇటీవల పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ కల్యాణమండపం అధ్యక్షుడు దాసరి శ్రీధర్, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, రామాంజప్ప, ప్రధాన కార్యదర్శి చింతా వెంకటేశ్వర్లు, కోశాధికారి చిదంబరయ్య, శేషయ్య, రూప ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

ధర్మవరం-షోలాపూర్ మధ్య ప్రత్యేక రైలు

గుంతకల్లు, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ధర్మవరం-షోలాపూర్ మధ్య అప్ అండ్ డౌన్ సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. షోలాపూర్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ (01437) ఈ నెల 24న రాత్రి 11-20 గంటలకు షోలాపూర్‌లో బయల్దేరి 26న ఉదయం మూడున్నరకు ధర్మవరం చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (01438) ఈ నెల 26న ఉదయం ఆరున్నరకు ధర్మవరంలో బయల్దేరి ఆదివారం ఉదయం 10-45 గంటలకు షోలాపూర్‌కు చేరుతుందన్నారు. ఈ రైలు కురుద్వాడి, బర్సి టౌన్, దారాశివ్ లాతూర్, లాతూర్ రోడ్, ఉదయగిరి, భల్కి, బీదర్, హోమ్నాబాద్, వాడి, యాదగిరి, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, తిరుపతి, పాకాల, పీలేరు, మదనపల్లి రోడ్డు, ములకల చెరువు, కదిరి స్టేషన్ల మీదుగా ధర్మవరం చేరుకుంటుందన్నారు.

చీనీ టన్ను రూ.17వేలు

అనంతపురం రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో గురువారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.17 వేలతో అమ్ముడుపోయాయని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయి. మార్కెట్‌కు 1230 టన్నుల చీనీకాయలు వచ్చాయి.

ఏసీబీ వలలో కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్

అనంతపురం క్రైం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఏసీబీ అధికారుల వలలో పెద్ద చేప పడింది. భారీగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కళ్యాణదుర్గం ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ నారాయణస్వామి అడ్డంగా దొరికిపోయారు. కళ్యాణదుర్గం మండలానికి చెందిన రియల్టర్ నాగేంద్ర నుంచి రూ.5 లక్షలు లంచం తీసుకుంటుండగా గురువారం రాత్రి ఏసీబీ అధికారులు దాడులు చేశారు. అనంతపురం నగరంలోని రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రియల్టర్ నాగేంద్ర ఒకటిన్నర ఎకరం వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ కోసం వెళ్లిన సమయంలో నారాయణస్వామి బేరసారాలకు దిగారు. అది అగ్రికల్చర్ ల్యాండ్ కాదని, మున్సిపాలిటీ పరిధిలో ఉన్నందున గజాల కింద చూపాల్సి వస్తుందని అన్నారు. దీనికి రిజిస్ట్రేషన్ ఫీజు ఎక్కువ అవుతుందని, తనకు రూ.5 లక్షలు ఇస్తే తగ్గిస్తానని లంచం అడిగారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. రిజిస్ట్రేషన్ పూర్తి అయిన తరువాత రూ.5 లక్షలు ఇస్తానని సబ్ రిజిస్ట్రార్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో ఈ నెల 17న ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేశారు. 18వ తేదీన డాక్యుమెంట్లు బాధితుడి చేతికి వచ్చాయి. అది మొదలు డబ్బుల కోసం సబ్ రిజిస్ట్రార్ ఫోన్‌లు చేయడం ప్రారంభించారు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు నాగేంద్ర ఆ సొమ్మును నారాయణస్వామికి గురువారం రాత్రి ఇచ్చారు. ఆ వెంటనే ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి ఆధ్వర్యంలో అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. డాక్యుమెంట్ల వెరిఫికేషన్ కోసం ఆయనను వెంటబెట్టుకుని కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి గురువారం రాత్రి 11 గంటల సమయంలో వెళ్లారు. సమగ్ర వివరాలను సేకరిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వలపన్ని సబ్ రిజిస్ట్రార్‌ను అరెస్టు చేశామని ఏసీబీ డీఎస్పీ ప్రశాంతి తెలిపారు.

వడ్డీ జలగల అరాచకాలు

- వారానికి నూటికి రూ.10 వడ్డీ
- అసలు కంటే ఎక్కువ రెట్లు చెల్లింపు
- ఇంకా.. ఇవ్వాలంటూ వేధింపులు
- ధర్మవరంలో రెండు చోట్ల దాడులు
- కేసులు నమోదు



ధర్మవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ జలగల అరాచకాలు తీవ్రమవుతున్నాయి. అడిగేవారెవరు, అడ్డుకునేవారెవరన్నట్లుగా పేట్రేగిపోతున్నారు. వారానికి నూటికి రూ.10 వడ్డీ వసూలు చేయడంతోపాటు, తీసుకున్న అప్పునకు మూడు, నాలుగు రెట్లు అధికంగా చెల్లించినా.. ఇంకా ఇవ్వాలంటూ వేధిస్తున్నారు. చెల్లిస్తామని వేడుకుంటున్నా వినకుండా ఏకంగా దాడులకు తెగబడుతున్నారు. ధర్మవరంలో వడ్డీ జలగల అరాచకాలపై బాధితుల ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

రెండు రెట్లకు పైగా చెల్లించినా..

పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన బసిరెడ్డిగారి ఆనందరెడ్డి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మేడాపురం రామయ్య వద్ద వారానికి నూటికి రూ.10 వడ్డీతో ఏడాదిన్నర క్రితం రూ.2.50 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఇప్పటికే రూ.1.50 లక్షలు వడ్డీకింద చెల్లించాడు. అసలు చెల్లించాలంటూ రామయ్య.. ఆనందరెడ్డిపై ఒత్తిడి తెచ్చాడు. దీంతో ఆనందరెడ్డి రూ.4.50 లక్షలు అప్పు తీసుకొచ్చి రామయ్యకు అసలు, వడ్డీ మొత్తం చెల్లించాడు. అయినా రామయ్య వడ్డీ దాహం తీరలేదు. తనకు ఇంకా చెల్లించాలంటూ ఆనందరెడ్డి ఇంటి వద్దకెళ్లి, అవమానించి బెదిరించాడు. ఈనెల 17వతేదీ ఆనందరెడ్డి కదిరి గేటు వైపు వెళ్తుండగా రామయ్య, అతడి కుమారులు ప్రదీప్, మంజు.. దాడి చేశారు. అటువైపు వెళ్తున్న రాజు, నరేశ్ విడిపించారు. దాడిపై ఆనందరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామయ్య, అతడి కుమారులు ప్రదీప్, మంజుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

తండ్రి, కుమారుడిపై దాడి

శాంతినగర్‌లో రమణ, దేవరశెట్టి భారతి దంపతులు నివాసముంటున్నారు. రమణ ఎర్రగుంటకు చెందిన రాజుతో రూ.6.10 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. వారానికి నూటికి రూ.10 వడ్డీ ప్రకారం రూ.60వేలు చెల్లిస్తున్నాడు. రమణ పట్టుచీరల వ్యాపారం చేస్తుండగా.. ఆయన భార్య ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటివరకు వడ్డీ రూపంలో రూ.15 లక్షలు చెల్లించారు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందుల వల్ల మూడు నెలల నుంచి వడ్డీ కట్టలేకపోయారు. అప్పటి నుంచి రాజు.. రమణకు ఫోన్ చేసి, డబ్బు కట్టమని బెదిరించడంతోపాటు భయపెట్టేలాప్రవర్తించాడు. రమణ వ్యాపారం నిమిత్తం వేరే గ్రామానికి వెళ్లినపుడు ఇంట్లో భార్య భారతి ఒంటరిగా ఉన్న సమయంలో కాలింగ్‌బెల్ కొట్టడం, గేటు గ్రిల్ చప్పుడు చేయడం చేస్తూ అసభ్యకరంగా తిట్టి వెళ్లేవాడు. దీంతో రమణ భూమి అమ్మి డబ్బు కడతాననీ, తన ఇంటి వద్దకు రావద్దని చెప్పినా రాజు వినలేదు. ఇంటి వద్దకు వచ్చి చంపుతామని బెదిరింపులకు దిగేవాడు. ఈక్రమంలో రాజు.. తన అనుచరులను గురువారం రమణ ఇంటిపైకి పంపి బెదిరించాడు. రమణ, కుమారుడు చరణ్‌సాయిపై దాడి చేసి, వారి నుంచి రూ.7వేలు లాక్కున్నారు. రమణ కుటుంబసభ్యులు అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి అడ్డుకున్నారు. దీనిపై రమణ భార్య భారతి ఫిర్యాదుమేరకు ఎర్రగుంట రాజు, మహేశ్, వినోద్, మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

వలస బతుకు ఛిద్రం

- నెల కిందటే పెనుకొండకు బళ్లారి వాసి
- పంక్చర్ షాపు పెట్టుకుని జీవనం
- కంటైనర్ దూసుకురావడంతో దుర్మరణం
- కుమారుడికి గాయాలు



పంక్చర్ షాపుపైకి దూసుకెళ్లి బోల్తాపడిన కంటైనర్

బతుకుపోరు విషాదాంతమైంది..
వలస బతుకు ఛిద్రమైంది..
భార్యాబిడ్డలతో ఊరుగాని ఊరొచ్చాడు..
పంక్చర్‌షాపుతో జీవనం మొదలెట్టాడు..
నెల కూడా తిరగలేదు..
మృత్యువు దూసుకొచ్చింది..
రెప్పపాటులో ఆయువు తీసింది..
అక్కడే ఉన్న బిడ్డా గాయపడ్డాడు..
బతుకుబండి తల్లకిందులైంది..
పెద్దదిక్కు ప్రాణాలు పోయాయి..
భార్యాబిడ్డలు దిక్కులేని వారయ్యారు..

పెనుకొండ రూరల్, జూలై24(ఆంధ్రజ్యోతి): నెలరోజుల క్రితమే వలస వచ్చిన వ్యక్తి బతుకుపోరు అర్థాంతరంగా ముగిసింది. మండలంలోని దుద్దేబండ క్రాస్ వద్ద జాతీయ రహదారి పక్కన పంక్చర్ షాపుపైకి గురువారం మధ్యాహ్నం కంటైనర్ దూసుకెళ్లడంతో ఫక్రుద్దీన్(36) దుర్మరణం చెందగా.. అతడి కుమారుడు మహ్మద్ ముస్తాక్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. కియ ఏఎస్ఐ వెంకటరమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన ఫక్రుద్దీన్ నెలరోజుల క్రితం పెనుకొండకు వలస వచ్చాడు. దర్గాపేటలో నివాసముంటూ దుద్దేబండ క్రాస్‌వద్ద జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డులో పంక్చర్‌షాపు ఏర్పాటు చేసుకున్నాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం షాపు ముందు ఫక్రుద్దీన్ పనిలో నిమగ్నమై ఉన్నాడు. కుమారుడు మహ్మద్ ముస్తాక్ షాపు లోపల ఉన్నాడు. ఆ సమయంలో బెంగళూరు నుంచి కియ వైపు వెళ్తున్న కంటైనర్ అతివేగంతో అదుపుతప్పి సర్వీసురోడ్డులోని ఫక్రుద్దీన్ పంక్చర్ షాపుపైకి దూసుకెళ్లింది. ఫక్రుద్దీన్ పైనుంచి వెళ్లడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. షాపు పాక్షికంగా కూలడంతో మహ్మద్ ముస్తాక్ స్వల్పగాయాలతో బటయపడ్డాడు. వెంటనే కంటైనర్ డ్రైవర్ పరారయ్యాడు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదుచేసి, మృతదేహాన్ని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. కుమారుడు మహ్మద్ ముస్తాక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. ఫక్రుద్దీన్‌కు భార్య ప్రహేనా, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వారంతా పెద్దదిక్కును కోల్పోయి, రోడ్డున పడ్డారు.



ఫక్రుద్దీన్ (ఫైల్)

అధికంగా కృష్ణాజలాలు

కేటాయింపులకు మించి తీసుకుంటాం

జలవనరుల శాఖ సీఈ నాగరాజ, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాజాస్వరూప్‌కుమార్



కృష్ణా జలాలకు హారతి ఇస్తున్న జలవనరుల శాఖ ఇంజనీర్లు

అనంతపురం క్లాక్‌టవర్/బెళుగుప్ప, జూలై24(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ ద్వారా కేటాయింపుల కంటే అధికంగా కృష్ణాజలాలు తీసుకుంటామని జలవనరుల శాఖ ప్రాజెక్టుల సీఈ నాగరాజ, హంద్రీనీవా ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్ తెలిపారు. జీడిపల్లి రిజర్వాయర్‌కి కృష్ణాజలాలు చేరడంతో గురువారం జిల్లా రైతులతో కలిసి జలవనరుల శాఖ, హంద్రీనీవా ఇంజనీర్లు ప్రత్యేక పూజలు చేశారు. రిజర్వాయర్ వద్ద జలహారతి ఇచ్చారు. అనంతరం ఇంజనీర్లను రైతులు సత్కరించారు. జలవనరుల శాఖ సీఈ నాగరాజ, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాజాస్వరూప్‌కుమార్ మాట్లాడుతూ.. హంద్రీనీవా కాలువ వెడల్పు, లైనింగ్‌తో నీటి వృథాను అరికడతామన్నారు. ఈనెల 17వతేదీన మల్యాల వద్ద నీటిని సీఎం చంద్రబాబునాయుడు విడుదల చేయగా... 22న జిల్లా సరిహద్దు రాగులపాడు వద్దకు కృష్ణాజలాలు చేరాయన్నారు. గురువారం జీడిపల్లికి చేరాయన్నారు. రాగులపాడు వద్ద మొదటిసారిగా 5 మోటార్లతో ఎత్తిపోతలను ప్రారంభించామని, జీడిపల్లి రిజర్వాయర్ 5 రోజుల్లో 5.5 టీఎంసీల వరకు వచ్చే నీటిని పీఏబీఆర్, ఎంపీఆర్‌కు విడుదల చేస్తామని తెలిపారు. జీడిపల్లి, గొల్లపల్లి, చెర్లోపల్లి, మారాల రిజర్వాయర్లతోపాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 165 చెరువులను కృష్ణా జలాలతో నింపుతామన్నారు. వేగంగా కావాల్సినంత నీటిని తీసుకుని ఆయా జలాశయాలు, చెరువుల్లో నీటి నిల్వ చేసుకునే వెసులుబాటు లభించిందన్నారు. రాబోయే రోజుల్లో రెండు పంటలకు సాగునీరు వచ్చే అవకాశం ఉందన్నారు. కేటాయించిన నీటి కంటే ఎక్కువగా తీసుకునే అవకాశం దక్కడం శుభపరిణామమన్నారు. మల్యాల నుంచి 3,400 క్యూసెక్కుల నీటిని తీసుకువచ్చి రాయలసీమను సస్యశ్యామలం చేయడం ఖాయమని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు రామకృష్ణయాదవ్, రామకృష్ణ, రమణ, పృథ్వీ సర్పంచ్ వెంకటనాయుడు, దుద్దేకుంట తిమ్మప్ప, నరేంద్ర, దామోదర్, తిమ్మప్ప, పురుషోత్తం పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవిని దర్శించుకున్న సినీనటుడు శ్రీకాంత్ దంపతులు



అలంకరణలో అమ్మవారు

తాడిపత్రి, జూలై24(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంటపల్లిలో వెలసిన శ్రీ చౌడేశ్వరీ దేవిని గురువారం సినీనటుడు శ్రీకాంత్, ఊహ దంపతులు దర్శించుకున్నారు. అమ్మవారి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేయించారు. అమ్మవారి ఉపాసకుడు వీరేష్ స్వామి.. శ్రీకాంత్ దంపతులకు శాలువా కప్పి, సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



శ్రీకాంత్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

అభివృద్ధి ప్రాజెక్టులకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్

అనంతపురం జూలై 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం సచివాలయంలో మంత్రిమండలి సమావేశం జరిగింది. అందులో ఆరోఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ (గతంలో అరబిందో రియాల్టీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేటు లిమిటెడ్)కు కేటాయించిన 800 మెగా వాట్ల శింగనమల పీఎస్పీ కెపాసిటీ ప్రాజెక్టు రద్దుకు చేసిన ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. జేఎస్‌డబ్ల్యూనియో ఎనర్జీ లిమిటెడ్ అభ్యర్థన మేరకు వైఎస్ఆర్ కడప జిల్లా జమ్మలమడుగు బదులుగా శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం సున్నపురాళ్లపల్లి, ఇతర గ్రామాల్లో 1450 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండలం ఆర్.అనంతపురం గ్రామంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. దీంతోపాటు ఏపీఐఐసీ ద్వారా వివిధ సర్వే నెంబర్లల్లో 439.27 ఎకరాల భూమిని ఉచితంగా కేటాయించాలని రెవెన్యూ శాఖ చేసిన ప్రతిపాదనలకు ఆమోద ముద్ర వేసింది.

టమోటా కిలో రూ.34

అనంతపురం రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో గురువారం కిలో టామోటాల ధర గరిష్ఠంగా రూ.34తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.17, సరాసరి ధర రూ.25తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3,750 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి కేంద్ర బృందం పర్యటన: కలెక్టర్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణాభివృద్ధి పనుల పరిశీలన కోసం శుక్రవారం నుంచి ఆగస్టు 1వరకు కేంద్ర బృందం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులపై కేంద్ర బృందం సభ్యుడు దయాకర్‌రెడ్డితో కలిసి అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రం బృందం సభ్యులు 25 నుంచి ఆగస్టు 1వరకు అమరాపురం, గాండ్లపెంట, రామగిరి మండలాల్లోని 8 గ్రామ పంచాయతీల్లో పర్యటిస్తారన్నారు. కేంద్ర బృందం గ్రామీణాభివృద్ధి పనులపై లబ్ధిదారులతో సమావేశం అవుతుందన్నారు. ప్రధానంగా ఉపాధి హామీ పథకం, పింఛన్ల పంపిణీ, మహిళా సంఘాల పనితీరు, హౌసింగ్, వాటర్‌షెడ్, తదితర పథకాల అమలుపై పరిశీలిస్తారన్నారు. కేంద్ర బృందం సభ్యులకు స్థానిక అధికారులు సహకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, డీపీఓ సమత తదితరులున్నారు.

రిటైర్డ్ ఏఎస్ఐ దౌర్జన్యం

● పొలం విషయంలో గొడవ ● కొడవలితో దాడి.. ఇద్దరికి గాయాలు



కొడవలితో బెదిరిస్తున్న రిటైర్డ్ ఏఎస్ఐ కృష్ణకుమార్

బెళుగుప్ప, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఏఎస్ఐ దౌర్జన్యానికి దిగాడు. వేటకొడవలితో బీభత్సం సృష్టించాడు. మండలంలోని ఆవులెన్న గ్రామంలో గురువారం పొలం విషయమై ఇద్దరిపై కొడవలితో దాడి చేయడంతో వారు ఆస్పత్రి పాలయ్యారు. ఎస్ఐ శివ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆవులెన్నకు చెందిన రైతు నాగరాజు, రిటైర్డ్ ఏఎస్ఐ కృష్ణకుమార్ మధ్య సర్వే నంబరు 97.98లో పొలం విషయమై వివాదం ఉంది. అధికారులు సర్వే చేసి హద్దులు కూడా ఏర్పాటు చేశారు. 24 సెంట్ల విషయంలో మాత్రమే వివాదం ఉంది. ఈ నేపథ్యంలో రైతు నాగరాజు గురువారం కుటుంబ సభ్యులతో కలిసి కంది విత్తేందుకు వెళ్లాడు. అనంతపురంలో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఏఎస్ఐ కృష్ణకుమార్ కొడవలితో ఆగ్రహంగా వచ్చాడు. రైతు నాగరాజు భార్య నాగలక్ష్మి, విత్తనం వేసేందుకు వచ్చిన ట్రాక్టర్ డ్రైవర్ అశోక్‌పై దాడి చేశాడు. వారికి గాయాలవడంతో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దాడిపై బాధితులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

24 మందికి ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి

ఉత్తర్వులు జారీ చేసిన డీఐజీ ప్రవీణ్

అనంతపురం క్రైం, జూలై 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 24 మంది ఏఎస్ఐలకు ఎస్‌లుగా ఉద్యోగోన్నతి లభించింది. జోన్-4 పరిధిలోని అనంతపురం, కర్నూలు జిల్లాల్లో పలువురికి ఉద్యోగోన్నతి కల్పిస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి వేర్వేరు జిల్లాల్లో పోస్టింగ్ ఇచ్చారు. ఉద్యోగోన్నతి పొందినవారిలో జిల్లాకు చెందిన రామచంద్రారెడ్డి, రాజశేఖర్, ఎం.రామక్రిష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్‌కి కర్నూలు జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. శ్రీనివాసగౌడ్, షఫీవుల్లా, వై.రామక్రిష్ణారెడ్డి, రామాంజినేయులు, సంపత్ కుమార్‌కి నంద్యాల జిల్లా, అశ్వత్థనారాయణరెడ్డి, వేణుచారి, శ్రీనివాసులు, సుధాకర్ రెడ్డి, రామమోహన్, కిష్టప్ప, త్రిలోక్‌నాథ్, నాగేశ్వర్‌రెడ్డి, షేక్షావలి, నాగరాజును తిరుపతి జిల్లాకు, రామాంజినేయులు, రమేష్, సూర్యనారాయణ, నారాయణరెడ్డికి అన్నమయ్య జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. ఉత్తర్వులు అందుకున్న 15 రోజుల్లో విధుల్లో చేరాలని డీఐజీ ఆదేశించారు. ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి పొందినవారు ఎస్పీ జగదీష్‌ని శుక్రవారం కలవనున్నారని సమాచారం.

అహుడా పనులను వేగవంతం చేయాలి

- జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, జూలై 24(ఆంధ్రజ్యోతి): అహుడా పరిధిలో ఉన్న పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్‌తో కలిసి అహుడా పనితీరుపై సమీక్షించారు. అనంతరం ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని ఎంఐజీ లేఅవుట్ల భూముల సేకరణ పనులు వేగవంతం చేయాలన్నారు. పెండింగ్ పనులను పరిశీలించి, అవసరమైన మేరకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణం తర్వాత ప్రజలు నివసించడానికి అనువైన మౌలిక సదుపాయాలు అందించగలిగే భూములను గుర్తించాలన్నారు. పెనుకొండ, ధర్మవరం, మడకశిర, గుత్తి, కూడేరు, కందుకూరు ప్రాంతాల్లో లేఅవుట్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అహుడా సెక్రటరీ రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ అధికారి ఇషాక్, ఈఈ దుష్యంత్, జేపీఓ హరీష్ పాల్గొన్నారు.

జర్మనీలో నర్సు ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

పుట్టపర్తి రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): జర్మనీలో నర్సు ఉద్యోగాల కోసం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి శివరంగప్రసాద్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 35ఏళ్లలోపు వయసు, బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసి రెండేళ్ల క్లినికల్ అనుభవం కలిగిన, జీఎన్ఎం నర్సింగ్ పూర్తి చేసి, మూడేళ్ల అనుభవం ఉన్న ఎస్సీ, ఎస్టీ మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి తిరుపతి, విశాఖపట్టణం, గుంటూరులో గిరిజన, సాంఘిక సంక్షేమశాఖల ఆధ్వర్యంలో జర్మన్ భాషపై 8 నుంచి 10 నెలలపాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఈనెల 29వతేదీలోపు dsweo.sss@gmail.com కి మెయిల్ ద్వారా కానీ, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 7981333346 నంబరులో సంప్రదించాలన్నారు.

అన్న క్యాంటీన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

బుక్కరాయసముద్రం, జూలై24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కేటాయించిన అన్న క్యాంటీన్‌ను మండలకేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయం పక్కన ఏర్పాటు చేసేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకుగాను గురువారం అనంతపురం రెవెన్యూ డివిజనల్ అధికారి కేశవులు నాయుడు, తహసీల్దార్ శ్రీధర్ మూర్తి పది సెంట్ల ప్రభుత్వం స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే అన్నక్యాంటీన్ భవన నిర్మాణపు పనులు చేపడుతామని ఆర్డీఓ తెలిపారు. తర్వాత ఆర్డీఓ స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్‌కు, రెవెన్యూ సిబ్బందికి సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

నార్పల, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చింతవనం కొట్టాల అంగన్‌వాడీ కేంద్రాన్ని, 37వ చౌకధాన్యపు డిపోను ఆర్డీఓ కేశవనాయుడు గురువారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థుల హాజరును పరిశీలించి ఎంత మంది పిల్లలు ఉన్నారు, ఎంత మంది హాజరయ్యారని వర్కర్ విమలను అడిగి తెలుసుకున్నారు. మెను ప్రకారం చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారా అని ఆరా తీశారు. మెనూ బోర్డును, స్టోర్ రూమ్‌లో బియ్యం, సరుకులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దారు అరుణ కుమారి, ఎంపీడీఓ మమతాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి జేడీ నియామకంపై సందిగ్ధత

అనంతపురం అర్బన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి జేడీ నియామకంపై సందిగ్ధత నెలకొంది. ఇదివరకు ఇక్కడ జేడీగా పని చేస్తున్న వెంకటస్వామి గత జూన్‌లో రిటైర్డ్ అయ్యారు. దీంతో వెంటనే పశుగణాభివృద్ధి సంస్థ డీడీగా పని చేస్తున్న సుధాకర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అయితే పశుగణాభివృద్ధి సంస్థలో ఫారిన్ సర్వీస్ కింద పని చేస్తున్న ఆయన తిరిగి మాతృ సంస్థ పశుసంవర్ధక శాఖలో సకాలంలో పోస్టింగ్ ఇవ్వకపోవడంతో ఇన్‌చార్జి జేడీ పదవి నుంచి రిలీవ్ అయ్యి సెలవుపై వెళ్లారు. ఈ క్రమంలో పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలో గొర్రెల అభివృద్ధి విభాగం ఏడీ శ్రీలక్ష్మిని ఇన్‌చార్జి జేడీగా నియమించారు. ఆ తర్వాత తాజాగా అనంతపురం డీడీ రమేష్‌రెడ్డికి ఇన్‌చార్జి జేడీగా బాధ్యతలు అప్పగించారు. ఇదే క్రమంలో ఉరవకొండ డీడీగా సుధాకర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వ్యక్తిగత కారణాల నేపథ్యంలో ఇన్‌చార్జి జేడీ బాధ్యతలు నిర్వర్తించలేదని రమేష్‌రెడ్డి కూడా ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా విన్నవించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తిరిగి ఇన్‌చార్జి జేడీగా ఎవరిని నియమిస్తారన్న అంశంపై సందిగ్ధత నెలకొంది.

హామీల అమలులో మోసం: వైసీపీ

అనంతపురం కలెక్టరేట్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో అలవిగాని హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇప్పుడు వాటిని అమలు చేయలేక ప్రజలను మోసం చేస్తున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. నగరంలోని 8వ డివిజన్ పరిధిలో గురువారం జరిగిన బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు కూటమి మేనిఫెస్టో వివరిస్తూ ఏడాదిగా ప్రజలకు ఎంత మేరకు నష్టం జరిగిందో క్యూఆర్ కోడ్ సాయంతో వివరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలను ఎవరిని అడిగినా తమకు పింఛన్ మాత్రమే అందుతోందని, మిగిలిన పథకాలు అందడం లేదని చెబుతున్నారన్నారు. 13 నెలలు దాటినా రైతులకు అన్నదాత సుఖీభవ అందలేదన్నారు. ఆడబిడ్డ నిధి కింద ప్రతినెలా రూ.1500లు అందిస్తామని చెప్పి ఒక్క రూపాయి కూడా అందించలేదన్నారు. ఇది దగా ప్రభుత్వమని మండిపడ్డారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లకు సన్మానం



బూత్, కో కన్వీనర్లను సన్మానించిన పరిటాల సునీత, శ్రీరామ్

అనంతపురం రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగుంట పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేసిన టీడీపీ బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లను ఎమ్మెల్యే పరిటాల సునీత, పార్టీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమన్నారు. పార్టీకోసం కష్టపడేవారికి తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల ఎంపిక కోసం గ్రామసభ

శింగనమల, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్థానిక రామస్వామి ఆలయంలో గురువారం బంగారు కుటుంబాల ఎంపిక కోసం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీఓ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. పీ-4 సర్వే ఆధారంగా అర్హత ఉన్న ప్రతికుటుంబాన్ని బంగారు కుటుంబంగా గుర్తిస్తామని తెలిపారు. ఇప్పటికే జాబితా రెడీ అయిందని, దానిని మరొకసారి క్షుణ్ణంగా పరిశీలించి అర్హులను అలాగే ఉంచి అనర్హుల కుటుంబాలు ఉంటే తొలగిస్తామని తెలిపారు. అర్హత ఉన్న కుటుంబాల నుంచి ఇంకా అర్జీలు తీసుకుంటామని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి తిప్పేస్వామి. వీఆర్ఓ ఎర్రితాతయ్య. విద్యాకమిటీ చైర్మన్ బోయ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు మృతికి నివాళి

అనంతపురం క్రైం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఏఆర్ విభాగంలో పని చేస్తున్న హోంగార్డు పెద్దన్న గురువారం ఉదయం గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎస్పీ జగదీష్ సంతాపం వ్యక్తం చేసి, అంత్యక్రియల ఖర్చులకు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు. స్థానిక అంబేడ్కర్ నగర్‌లో ఉంచిన పెద్దన్న మృతదేహాన్ని ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఆర్ఐ రాముడు, ఆర్ఎస్ఐ జాఫర్ సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని తెలిపారు.

మహిళా పోలీసులతో సమావేశం

శింగనమల, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని 13 గ్రామ సచివాలయాల్లో ఇటీవల బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన మహిళా పోలీసులతో ఎస్ఐ విజయ్‌కుమార్ మండలకేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల ప్రజలతో కలిసి మెలిసి ఉండాలని, గొడవలు, ఘర్షణలు జరగకుండా ముందస్తు అవగాహన కల్పించాలని సూచించారు. అవాంఛనీయ సంఘటలు జరిగినా వెంటనే తమకు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ చితంబరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



సోలార్ ప్యానల్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్



శింగనమలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రతి ఇంటిలో సోలార్ వెలుగులు

● రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ● ఎన్ఎస్ గేట్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సూర్యఘర్‌పై అవగాహన సదస్సు

చెన్నేకొత్తపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటిలోనూ సోలార్ విద్యుత్ వెలుగులు ఉండాలని, అదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే పరిటాలసునీత అన్నారు. మండలంలోని ఎన్ఎస్‌గేటు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై అవగాహన సదస్సు జరిగింది. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సోలార్ ప్యానల్‌కు సంబంధించి ప్రదర్శనను పరిశీలించారు. సోలార్ ఎలా పనిచేస్తుంది, ఏర్పాటుకు అయ్యే వ్యయం, ప్రభుత్వ సబ్సిడీ, బ్యాంకు రుణాలు, దీని వల్లకలిగే ఉపయోగాల గురించి విద్యుత్ శాఖ అధికారులు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లాలో ముందుగా ఈ కార్యక్రమాన్ని రాప్తాడు నియోజకవర్గం నుంచే ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. సామాన్య ప్రజలు విద్యుత్ భారం లేకుండా ఇంటిపైన సోలార్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అందుకు ప్రభుత్వం నుంచి రూ.60వేల వరకు సబ్సిడీ ఉంటుందన్నారు. ఎస్సీ,ఎస్టీలకైతే పూర్తిగా ఉచితమని, బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో రూ.20వేలు సబ్సిడీ ఇస్తుందని పేర్కొన్నారు. బ్యాంకర్లు కూడా ఈ పథకానికి రుణాల మంజూరు విషయంలో షరతులు లేకుండా చూడాలని సూచించారు. పరిటాలశ్రీరామ్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరు తమ తమ ఇళ్లపై సోలార్ ప్యానల్ ఏర్పాటుచేసుకోవడంతోపాటు మరి కొందరిని ప్రోత్సహించాలని సూచించారు. దీని వల్ల విద్యుత్‌బిల్లును పూర్తిగా ఆదా చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ శివరాం, ఏడీఈ లక్ష్మీనారాయణ, సీకేపల్లి, రామగిరి ఏఈలు రామాంజనేయులు, వెంకటేశ్‌నాయక్, ఏడీసీసీ బ్యాంక్‌చైర్మన్‌సెట్టెం వెంకటేశ్, రాప్తాడు మార్కెట్‌యార్డు చైర్మన్ సుధాకర్‌చౌదరి, టీడీపీ సీనియర్ నాయకులు రంగయ్య, రామ్మూర్తినాయుడు, మండల కన్వీనర్‌లు ముత్యాల్‌రెడ్డి, సుధాకర్, యాతంపోతలయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు దండుఓబుళేశు, రామగిరి, సీకేపల్లి కెనరాబ్యాంకుల అధికారులు, సోలార్ కంపెనీల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

అనంతరం ఎమ్మెల్యే ఎన్ఎస్ గేటు కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలకు ఏడాది పాలనలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా.. సీఎం చంద్రబాబు పథకాలన్నీ అమలు చేస్తున్నారన్నారు. ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం ఉంటుందన్నారు. ఏడాదికాలంలో రాప్తాడు నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామని పేర్కొన్నారు.

ప్రతిఒక్కరూ సోలార్ విద్యుత్ వినియోగించాలి: ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద సోలార్ విద్యుత్‌ను నియోజకవర్గంలో ప్రజలు వినియోగించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. మండలకేంద్రంలో ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకంపై ఎల్విర్ ఎనర్జీ సంస్థ వారు అవగహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు ఏడీసీసీ బ్యాంకు చెర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, రాష్ట్ర టీడీపీ అధికారప్రతినిధి ఆలంనరసానాయుడు, ఎల్విన్ ఎనర్జీ ఎండీ విజయ్ భాస్కర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గం వ్యాప్తంగా సోలార్ విద్యుత్‌ను వంద శాతం వాడుకలోకి తీసుకు రావడానికి కృషి చేస్తానని అన్నారు. రైతులు కూడా సోలార్ విద్యుత్‌ను పంపుసెట్లకు వాడుకోవచ్చని తెలిపారు. విద్యుత్ డీఈ జొన్నలగడ్డల రమేష్‌బాబు, ఏఈ, విజయ్‌కుమార్, టీడీపీ కన్వీనర్ ఆదినారాయణ, చెరువు ఆయకట్టు అధ్యక్షుడు సత్యనారాయణ, సింగిల్‌విండో అధ్యక్షుడు గుర్రం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాలాన్ని మేల్కొలిపిన మహాకవి జాషువా

● వర్ధంతి సభలో కొనియాడిన వక్తలు



జాషువా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కాలాన్ని మేల్కొల్పిన మహాకవి గుర్రం జాషువా అని, ఆయన రచనల తో సమాజంలో చైతన్యం తీసుకొచ్చారని వక్తలు కొనియాడారు. గుర్రం జాషువా 54వ వర్ధంతిని పురస్కరించుకుని నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి గురువారం జాషువా సాహిత్య పీఠం వారు పూలమాలలు వేసి నివాళులర్పించా రు. ఈ సందర్భంగా ఆ పీఠం ప్రధాన కార్యదర్శి నాగలింగయ మాట్లాడుతూ... సాహిత్యం నేటి యువతరానికి ఎంతో అవసరమని, జాషువా సాహిత్యం విశ్వజనీనమైనదని పేర్కొన్నారు. జాషువా సాహిత్యం పండితులకు, పామరులకు సరళంగా అర్థమయ్యేలా ఉంటుందని కొనియాడారు. జాషువా సాహిత్యాన్ని విద్యార్థి లోకానికి అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్కేయూ తెలుగుశాఖ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ నానీల నాగేంద్ర మాట్లాడుతూ... వర్ణ సమాజం, వర్గ సమాజం పోవాలని సాహిత్యాన్ని సృష్టించిన మహాకవి జాషువా అన్నారు. గబ్బిలం, కాందిశీకుడు, బాపూజీ, నేతాజీ, ముంతాజ్ మహల్, ఫిరదౌసి వంటి కావ్యాలతో జాషువా తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారన్నారు. కార్యక్రమంలో పూజారి ఈరన్న, ఉల్లికల్లు మల్లికార్జున, ఓబుళపతి, దాసరి ఆదినారాయణ, శంకర్ కుళ్లాయప్ప, చంద్రచెర్ల హరి, చెట్ల ఈరన్న, షేక్ రియాజుద్దీన్, డాక్టర్ జూటూరు షరీఫ్, టీవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యంకి జయంతి



అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులు

అనంతపురం విద్య, జూలై24(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయపితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతి వేడుకలను నగరంలోని జిల్లాగ్రంథాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి ఉద్యోగులు సిబ్బంది, విద్యార్థులు కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయ కార్యదర్శి రమ మాట్లాడుతూ పుస్తకాల విలువలను మానవాళికి చాటిచెప్పిన మహనీయుడు అయ్యంకి వెంకటరమణయ్య అని కొనియాడారు. జిల్లా స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు గ్రంథాలయఉద్యమాన్ని నడపుతూ పుస్తకాల విలువలను మానవాళికి చాటిచెప్పారని తెలిపారు. ఆ మహనీయుడి అడుగుజాడలలో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించిన ప్రతిభకనపరిచిన వారికి బహుమతులు అందజేశారు. డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న, అసిస్టెంట్‌లైబ్రేరియన్ గోవింద్, సాహిత్యకవి అంకెరామలింగయ్య, సామాజిక కార్యకర్త మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ పోటీల్లో శ్రీవాణి విద్యార్థుల సత్తా

అనంతపురంరూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ పోటీల్లో స్థానిక శ్రీవాణి డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ఇటీవల శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో జరిగిన సౌత్‌జోన్ క్రికెట్, బాల్‌బ్యాడ్మింటన్, షెటిల్ పోటీల్లో కళాశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు పాల్గొని ప్రతిభకనబరిచి సర్టిఫికెట్లు సాధించినట్లు ఫిజికల్ డైరెక్టర్లు అంజనేయులు, లక్ష్మీ తెలిపారు. ఈసందర్భంగా గురువారం కళాశాలలో ప్రతిభచాటిన విద్యార్థులను ప్రిన్సిపాల్ వనజమ్మ, వైస్ ప్రిన్సిపాల్ సుధీర్‌రెడ్డి అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ప్రారంభం

అనంతపురం అర్బన్, జూలై24(ఆంధ్రజ్యోతి): ఏపీ వ్యవసాయ శాఖ, సాధికార సంస్థ ఆధ్వర్యంలో పలు జిల్లాలకు చెందిన ప్రకృతి వ్యవసాయ విభాగం డీపీఎంలు, సిబ్బందికి అనంతపురం ప్రకృతి వ్యవసా యం కార్యాలయంలో శిక్షణను గురువారం ప్రారంభించారు. తొలిరోజు నేలల రకాలు, స్వభావాలు, జల వనరుల ప్రాజెక్టులు, వివిధ ప్రకృతి వ్యవసాయం ఆవిష్కరణలపై అవగాహన కల్పించారు. నెలాఖరు దాకా పలు అంశాలపై శిక్షణ కార్యక్రమాలు కొనసాగించనున్నట్లు ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మానాయక్ తెలిపారు.

నగరంలో సుపరిపాలనలో తొలిఅడుగు

అనంతపురం క్రైం, జూలై 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీ, ఆర్డీఓ కార్యాలయం తదితర ప్రాంతాల్లో గురువారం టీడీపీ శ్రేణులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. అలాగే కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్ర నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ డైరెక్టర్ కడియాల కొండన్న, పార్టీ సీనియర్ నాయకుడు శివన్న పాల్గొన్నారు. అదేవిధంగా 29వ డివిజన్‌లో బూత్ ఇన్‌చార్జి సాధిక్ వలి, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేష్, మాజీ కోఆప్షన్ సభ్యుడు మున్వర్, డివిజన్ ఇన్‌చార్జి సరిపూటి శ్రీకాంత్ సుపరిపాలనలో తొలిఅడుగును నిర్వహించారు. ఇక 21వ డివిజన్‌లో క్లస్టర్ కో-ఆర్డినేటర్ లక్ష్మీనరసింహ, బూత్ ఇన్‌చార్జి శివకుమార్, నారాయణస్వామి కార్యక్రమాన్ని చేపట్టారు.

చికిత్స పొందుతూ టీడీపీ కార్యకర్త మృతి

అనంతపురం రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణంరెడ్డిపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త గోగుల నారాయణస్వామి (38) ఈనెల 22వ తేదీ రాత్రి 9గంటల సమయంలో రాప్తాడు మండలం బండమీద పల్లి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. నగరంలోని ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మార్చురీలో ఉన్న మృతదేహాన్ని మండల ప్రధాన కార్యదర్శి షెక్షావలి నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ రాగే మురళి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నాయకులు రమేష్, తిరుపాలు, తిరుపతయ్య, కొండారెడ్డి పాల్గొన్నారు.

నూతన కోర్సులకు ఆదరణ

అనంతపురం రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ ఇంజనీరింగ్ కళాశాలకు అనుమతులు ఇచ్చిన రెండు కోర్సుల్లో సీట్లు మొత్తం భర్తీ అయ్యాయి. ఇటీవల రెండు కోర్సులకు అనుమతులు లభించిన విషయం విదితమే. కంప్యూటర్ సైన్స్ డేటా సైన్స్ (సీఎస్‌డీ), కంప్యూటర్ సైన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్. మెషిన్ లెర్నింగ్ (సీఎస్ఎఎం) కోర్సులకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఈ విద్యా సంవత్సరం నుంచే వీటిని ప్రవేశపెట్టారు. ప్రతి కోర్సులో 60 చొప్పున మొత్తం 120 సీట్లు ఉన్నాయి. ఇటివల సీట్ల భర్తీ ప్రక్రియ చేపట్టారు. సీట్లు మొత్తం భర్తీ అయినట్లు సంబంధిత కళాశాల అధికారులు తెలిపారు. దీంతో గురువారం వర్సిటీ వీసీ అనితను కలిసి, వివరించారు. వీసీ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ కళాశాలను రాయలసీమలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామన్నారు. అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, అసిస్టెంట్ రిజిస్ట్రార్ తిమ్మప్ప, అధ్యాపకులు పాల్గొన్నారు.

దోమల నివారణకు గంబూచియా చేపల విడుదల

రాప్తాడు, జూలై 24:ఆంధ్రజ్యోతి): దోమల నివారణకు నీటి కుంటల్లో గంబూచియా చేపలు వదులుతున్నట్లు జిల్లా మలేరియా అధికారి ఓబులు తెలిపారు. మండలంలోని రాప్తాడు, గొందిరెడ్డిపల్లి, బండమీద పల్లి గ్రామాల్లో నీటి కుంటల్లో గురువారం ఆయన గంబూచియా చేపలు వదిలారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి కుంటలలో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. కనుక వాటిల్లో గంబూచియా చేపలు వదలడం ద్వారా దోమ లార్వాలను ఆ చేపలు తిని దోమలు వృద్ధి కాకుండా సహాయపడతాయన్నారు. గ్రామ సమీపంలో జనాలకు దగ్గరగా ఉన్న నీటి కుంటల్లో గంబూచియా చేపలు వదలడం వల్ల దోమల వృద్ధి తగ్గి డెంగీ, మలేరియా, చికెన్ గునియా వంటి జబ్బులు ప్రజలకు సోకవని తెలిపారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సూపర్వైజర్లు నూర్‌బాషా, శ్రీధర్‌మూర్తి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి జయంతి

బుక్కరాయసముద్రం/శింగనమల/ నార్పల, జూలై 24(ఆంధ్రజ్యోతి): చౌడేశ్వరీదేవి జయంత్యుత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద, వడియంపేటలో ఉన్న చౌడేశ్వరీ ఆలయాల్లో అర్చకులు ఉదయమే అమ్మవార్ల మూలవిరాట్‌లకు పలుఅభిషేకాలు, అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి బోనాలు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. శింగనమలలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల చౌడేశ్వరి ఆలయంలోనూ, నార్పల మండల కేంద్రంలో చౌడేశ్వరి ఆలయంలోనూ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి.





బీకేఎస్, నార్పలలో ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న చౌడేశ్వరీదేవి

రేపు వార్షిక మహాసభ

రామగిరి, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ప్రతిభా వికలాంగుల సొసైటీ 17వ వార్షిక మహాసభను శనివారం నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు నాగరాజు, సీఈఓ నరసింహుడు గురువారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:35గంటలకు స్థానిక మహిళా శక్తి సొసైటీ ఆవరణలో ఈ వార్షిక సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతిభా వికలాంగ సొసైటీ సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

గూగూడు కుళ్లాయిస్వామి ఆలయం పరిశీలన



మాట్లాడుతున్న ఆర్డీఓ కేశవనాయుడు

నార్పల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గూగూడు కుళ్లాయి స్వామి ఆలయంలో హుండీ పక్కదారి పట్టిందన్న దాంట్లో వాస్తవం లేదని ఆర్డీఓ కేశవనాయుడు, డీఎస్పీ వెంకటేశులు వెల్లడించారు. కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన ఒక హుండీ గల్లంతైనట్లు పత్రికలు, సోషల్‌మీడియాలో వార్తలు వెలువడ్డాయి. దీంతో స్పందించిన ఆలయ ఈఓ శోభ గత బుధవారం ఆలయ ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించి ఆలయంలో ఎటువంటి హుండీ గల్లంతు కాలేదని తెలిపారు. హుండీ బరువుగా ఉండడంతో అందులోని నగదును కుళ్లాయిస్వామి ఆలయంలోంచి లెక్కింపు జరిగే ప్రదేశానికి తీసుకొచ్చామని అన్నారు. ఆ హుండీ డబ్బు తీసే సీసీ పుటేజ్ బహిర్గతం చేయాలని విలేకరులు కోరగా ఆ వివరాలన్ని పెన్‌డ్రైవ్‌లో భద్రపరిచామని, ఉన్నతాధికారులకు చూపుతామని అన్నారు. గ్రామ పెద్దల సమక్షంలో గురువారం ఆర్డీఓ కేశవనాయుడు, డీఎస్పీ వెంకటేశులు సీసీ పుటేజ్‌లను పరిశీలించి హుండీ పక్కదారి పట్టలేదని నిర్ధారించారు. సీసీ పుటేజ్‌లను బహిర్గతం చేస్తారా లేదా అనేది తెలపలేదు. సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎదుగుదల చూసి ఓర్వలేకే విమర్శలు: ఎంఈఎఫ్

అనంతపురం విద్య జూలై 24, (ఆంధ్రజ్యోతి): మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఎదుగుదలను చూసి ఓర్వలేకనే కొందరు వైసీపీ నాయకులు పనిగట్టుకొని విమర్శలు చేస్తున్నారని మాదిగ ఉద్యోగులసమాఖ్య (ఎంఈఎఫ్) జాతీయ ప్రధానకార్యదర్శి బండారు శంకర్ మండిపడ్డారు. నగరంలోని ఎంఈఎఫ్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి అనంతజిల్లా పరిధిలో ఓ దళిత బాలికపై జరిగిన అఘాయిత్యం దురదృష్టకరమన్నారు. ఈఘటనపై ఇప్పటికే కేసులు నమోదు చేసి నిందితులను జైళ్లకు పంపడం జరిగిందన్నారు. ఇలాంటి ఘటనను ఎంఎస్‌రాజుకు ఆపాదిస్తూ మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఆయనపై లేనిపోని ఆరోపణలు, విమర్శలు చేయడం సరికాదన్నారు. మాదిగ ఎమ్మెల్యేలను బదనాం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

దళిత ప్రజాప్రతినిధులపై విమర్శలను సహించం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం క్రైం, జూలై 24(ఆంధ్రజ్యోతి): దళిత ప్రజాప్రతినిధులపై విమర్శలు చేస్తే సహించమని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్ మండిపడ్డారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, హోంమంత్రి అనితను వైసీపీ నాయకులు అగౌరవంగా మాట్లాడటం తగదన్నారు. జగన్ పాలనలో ఎంత మంది దళితులను టార్గెట్ చేసి దాడులు చేశారో, హత్యలు జరిగాయోగా తెలుసుకోవాలన్నారు. వైసీపీ నేత సాకే చంద్ర గతంలో ఎక్సైజ్ కార్యాలయంలో మహిళా ఉద్యోగిపై స్టేషన్‌లోనే దౌర్జన్యం చేసిన ఘటన మర్చిపోయారా అంటూ ప్రశ్నించారు. వైసీపీ నాయకులు ఇలాగే చౌకబారు మాటలు మాట్లాడితే...సహించేది లేదని హెచ్చరించారు. టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు ధనుంజయనాయుడు, నాయకులు పొన్నూరప్ప, జయరాం నాయక్, నాగార్జున, హరి, అశోక్, శివ, రమేష్ పాల్గొన్నారు.

క్షమాపణలు చెప్పకుంటే జిల్లాలో తిరగనివ్వం

అనంతపురం క్రైం: దళిత ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, హోంమంత్రి అనితపై విమర్శలు చేసిన వైసీపీ నాయకులు వెంటనే క్షమాపణలు చెప్పాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి బంగి నాగ, జనసేన నాయకుడు మునగల అనిల్‌కుమార్ నగరంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత వైసీపీ పాలనలో నిత్యం దళితులపై దాడులు జరిగాయన్నారు. ఇప్పుడు కూటమి దళిత ఎమ్మెల్యేలపై అవాకులు చవాకులు మాట్లాడడం తగదన్నారు. కూటమి నేతలకు వెంటనే క్షమాపణలు చెప్పాలన్నారు. లేకపోతే జిల్లాలో తిరగనివ్వమని హెచ్చరించారు. నాయకులు సత్యనారాయణ, వెంకటేష్‌గౌడ్, అనిల్, పృథ్వీ, సాయి పాల్గొన్నారు.

ఆధారాల్లేకుండానే అరెస్టు

అనంతపురం కలెక్టరేట్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఆధారాలు లేకపోయినా రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేయడం సరికాదని వైసీపీ సీనియర్ నేత ఎంఎం గౌస్‌బేగ్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ హయాంలో ఎలాంటి లిక్కర్ స్కాం జరగలేదన్నారు. అక్రమంగా ఎంపీని ఇరికించారని పేర్కొన్నారు.

హాస్టళ్లలో కనీస వసతులు కల్పించాలి: ఏఐఎస్ఎఫ్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి

అనంతపురం విద్య, జూలై 24(ఆంధ్రజ్యోతి): సంక్షేమహాస్టళ్లలో కనీస వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లాప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి డిమాండ్ చేశారు. హాస్టళ్ల సందర్శనలో భాగంగా గురువారం ఆయన జిల్లాకేంద్రంలోని గిల్డ్‌ఆఫ్‌సర్వీస్‌స్కూల్ సమీపంలో గల హాస్టళ్లను పరిశీలించారు. అనంతరం అక్కడి విద్యార్థులో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లను సందర్శిస్తున్నామని తెలిపారు. అనేక హాస్టళ్లలో మౌలిక వసతులు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాస్మోటిక్ చార్జీలు ఏ మాత్రం సరిపోవడం లేదన్నారు. మెనూ పెంచినా చార్జీలు పెంచకపోవడంవల్ల నాణ్యమైన భోజనం అందకుండా పోతోందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి హాసళ్లలో సమస్యలు పరిష్కరించాలన్నారు.లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నాయకులు మంజునాథ్, సమీర్, కార్తీక్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరా బంద్

యల్లనూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ పద్మనాభరెడ్డి తెలిపారు. ప్రధాన విద్యుత్‌లైన్ల మార్పులు జరుగుతుండడంతో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు.

నేడు కంటి వైద్యశిబిరం

తాడిపత్రి, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్‌బజారులో ఉన్న ఆర్‌వీస్వామి కల్యాణ మండపంలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు శ్యాంప్రసాద్ తెలిపారు. ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యూరియా దొరక్క రైతుల పాట్లు

శెట్టూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలో ఖరీఫ్ సీజన్లో రైతులు అధికశాతం మొక్కజొన్న పంట సాగు చేశారు. ఇందుకు యూరియా అవసరం ఎక్కువగా ఉంటుంది. ఎరువుల దుకాణదారులు ఎరువులు కొంటేనే యూరియా బస్తాలు ఇస్తామని మెలికపెడుతున్నారు. దీంతో రైతులు కర్ణాటక ప్రాంతానికి వెళ్లి యూరియా తెచ్చుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి రైతు భరోసా కేంద్రాల ద్వారా యూరియా అందజేయాలని వానే కోరుతున్నారు.

ఆర్టీసీ ఎన్ఎంయూ కార్యవర్గం ఏకగ్రీవం



ఎన్ఎంయూ నూతన కార్యవర్గం

గుత్తి, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోని ఎన్ఎంయూ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆర్టీసీ ఎన్ఎంయూ నూతన కార్యవర్గాన్ని రీజనల్ కార్యదర్శి ప్రతాప్ ఎనారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగరాజు సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డిపో అధ్యక్షుడిగా అంజి, కార్యదర్శిగా ఎన్‌వీ రాముడు, గ్యారేజ్ అధ్యక్షుడిగా శివశంకర్, కార్యదర్శిగా జేఎస్ గౌడ్, గౌరవ సలహాదారుడిగా శంకరయ్యను ఎన్నుకున్నారు.

శోభాయాత్రను విజయవంతం చేయండి

తాడిపత్రి, జూలై 24(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈనెల 30న అనంతపురానికి వస్తున్న సందర్భంగా నిర్వహిస్తున్న శోభాయాత్రను విజయవంతం చేయాలని రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పీవీ ప్రతాప్‌రెడ్డి కోరారు. స్థానిక నివాసంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. మొదటిసారి జిల్లాకు వస్తున్న మాధవ్‌కు నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికి శోభాయాత్రలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో కర్నూల్ జిల్లా ఇన్‌చార్జ్ అంకాల్‌రెడ్డి, నాయకులు ఆంజనేయులు, రంగనాథ్ రెడ్డి, శింగరి లక్ష్మీనారాయణ, రామాంజనేయులు పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై సమాచారమివ్వండి

ఉరవకొండ, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా ఎంఆర్‌పీ కంటే తక్కువ ధరకు మద్యం విక్రయిస్తుంటే.. అది నకిలీ మద్యం అయి ఉండవచ్చని, ఆ సమాచారాన్ని వెంటనే 14405కు తెలియజేయాలని జిల్లా డిప్యూటీ కమిషనర్, ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి నాగమద్దయ్య సూచించారు. పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌ను, అలాగే ఉరవకొండ, విడపనకల్లులో మద్యం షాపులను, డొనేకల్లు, విడపనకల్లు, చెక్‌పోస్టులను ఆయన గురువారం తనిఖీ చేశారు. కర్ణాటక నుంచి వచ్చే అక్రమ మద్యంపై నిఘా ఉంచాలని సూచించారు. ఆయన వెంట ఏఈఎస్ శ్రీరామ్, సీఐ రవిచంద్ర, ఎస్ఐ వీరస్వామి ఉన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి వాసుకిరాణి

శెట్టూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్థానిక సచివాలయం వద్ద మండల వ్యవసాయాధికారిని వాసుకీరాణి సమాచార హక్కు చ ట్టంపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాచార హక్కు సామాన్య ప్రజలకు వజ్రాయుధం లాంటిదన్నారు.

29న మండల సర్వసభ్య సమావేశం

రాయదుర్గంరూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కొండన్న గురువారం ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు తమ నివేదికలతో ఈ సమావేశానికి హాజరుకావాలన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండండి

రాయదుర్గంరూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు యువతీయువకులు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ మహేష్‌కుమార్ సూచించారు. గురువారం పట్టణంలోని జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో అనే పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మత్తుపదార్థాల వాడకం వలన కలిగే నష్టాల గురించి వివరించారు.

రీసర్వే పరిశీలన

ఉరవకొండ, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెరమెట్ల గ్రామంలో నిర్వహిస్తున్న రీసర్వేను డిప్యూటీ డైరెక్టర్ హరికృష్ణ గురువారం పరిశీలించారు. రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, సమస్యలుంటే రైతులు తమ డాక్యుమెంట్‌లు తీసుకుని వచ్చి సరిచేసుకోవాలని సూచించారు. ఆయన వెంట డీఐఏఎస్ గుప్తా, తహసీల్దార్ మహబూబ్‌బాషా, మండల సర్వేయర్ రత్నాకర్, రీసర్వే డీటీ పవన్ ఉన్నారు.

రైతు ఆత్మహత్యపై విచారణ

పుట్లూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలాపురం గ్రామానికి చెందిన రైతు రామాంజులరెడ్డి జూన్‌లో అప్పుల బాధతో తాడిపత్రిలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. ఈ విషయంపై గురువారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ శేషారెడ్డి విచారణ చేపట్టారు. కుటుంబ సభ్యులను అడిగి ఎంతమేర అప్పులు ఉన్నాయని, వాటికి సంబంధించిన బాండ్లను పరిశీలించారు. ఆయన వెంట వ్యవసాయాధికారి కాత్యాయిని ఉన్నారు.

ఉండబండలో జడ్పీ సీఈఓ పర్యటన

విడపనకల్లు, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉండబండ గ్రామంలో జడ్పీ సీఈఓ శివశంకర్ గురువారం పర్యటించారు. ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ షకీలాబేగం, ఈఓఆర్డీ సత్యబాబు, ఏఓ బాస్కర్‌బాబు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

గుంతకల్లుటౌన్, జూలై24(ఆంధ్రజ్యోతి): పాతగుంతకల్లులోని బ్రహ్మయ్యస్వామి దేవాలయం వద్ద నివాసముంటున్న బాష, బీబీల 14 ఏళ్ల కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. ఆ కుటుంబానికి రూ.10 వేలను ఆ నలుగురు సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్, సభ్యులు కేశవ, చక్రపాణి, సాయి గురువారం అందజేశారు.

నిర్వహణ గాలికి..!

- చెరువుల్లో, కట్టలపై కంపచెట్లు
- తగ్గుతున్న నీటి నిల్వలు



చెరువు కట్టపై పెరిగిన కంపచెట్లు



ఇప్పేరు చెరువులో దెబ్బతిన్న తూము

కూడేరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లగా ఏ మాత్రం నిర్వహణ లేకపోవడంతో మండలంలోని అరవకూరు, పొట్టిచెరువు, ఇప్పేరు, మరుట్ల, కరుట్లపల్లి, కొర్రకోడు ఓబులయ్య కుంట తదితర గ్రామాల్లో చెరువుల్లో, వాటి కట్టలపై కంపచెట్ల భారీగా పెరిగాయి. వాటిని తొలగించపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతోంది. కొన్ని సంవత్సరాలుగా తూములు దెబ్బతిన్నా... వాటికి మరుమ్మతులు చేయించలేదు. దీంతో చెరువులకు వచ్చిన నీరంతా బయటకు వెళ్లి వృథా అవుతోంది. చెరువుల్లో నీరు నిల్వ ఉంటే ఆయకట్టుతో పాటు చుట్టపక్కలున్న బోరుబావుల్లో భూగర్భ జలాలు సంవృద్ధిగా పెరుగుతాయి. అయితే కట్టలు దెబ్బతినడంతో లీకేజీలు ఏర్పడి ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండటం లేదు.

నివేదికలు పంపాం : సుధాకర్, మైనర్ ఇరిగేషన్ ఏఈ

మండలంలోని ఇప్పేరు, కరుట్లపల్లి, మరుట్ల చెరువుల కట్టలు, తూములు, మరువల మరమ్మతుల పనులు చేయడానికి నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపాం. కేంద్ర ప్రభు త్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వాల 40 శాతం అందించే ఆర్. ఆర్. ఆర్ (రిపేర్స్, రెనవేషన్ అండ్ రెస్టోరేషన్) కింద రూ, 2.16 కోట్ల నిధులు అవసరం. అదే విధంగా పొట్టి చెరువు పనుల చేయడానికి రూ, 45 లక్షలు అవసరమని నివేదికలు తయారు చేస్తున్నాం. ప్రస్తుతం కరుట్లపల్లి, ఇప్పేరు, మరుట్ల, అరవకూరు, పొట్టి చెరువుల్లో కంపలు తొలగించేందుకు, కాలువల్లో పూడిక తీత పనులకు రూ, 14 లక్షలు నిధులు విడుదల అయ్యా యి. త్వరలోనే ఆ పనులు చేపడుతాం.



యాడికి, గుంతకల్లు, పుట్లూరు మండలం గరుగుచింతలపల్లి, ఉరవకొండ, రాయదుర్గం, తాడిపత్రిలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఘనంగా చౌడేశ్వరీమాత జయంతి



పెద్దవడుగూరులో పూజలో పాల్గొన్న మహిళలు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్ : చౌడేశ్వరిదేవి అమ్మవారి జయంతి వేడుకలను పలు ప్రాంతాల్లో గురువారం వైభవంగా నిర్వహించారు. గుంతకల్లు, రాయదుర్గంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఉరవకొండలో గంగజలాన్ని ఊరేగింపు మేళాతాళాల మ. ద్య తీసుకెళ్లి అమ్మవారిని అభిషేకించారు. అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. అలాగే పెద్దవడుగూరు, యాడికి, పుట్లూరు, కుందుర్పి, తాడిపత్రి, యల్లనూరు మండలాల్లోనూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కుందుర్పిలో అమ్మవారి ఊరేగింపు

తొగటవీర క్షత్రియుల అభివృద్ధికి కృషి : విప్



బహుమతి అందిస్తున్న విప్ కాలవ

రాయదుర్గం, జూలై 24(ఆంధ్ర జ్యోతి): తొగటవీర క్షత్రియ సమాజ అభివృద్ధికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని తొగట వీర క్షత్రియ సంక్షేమ సమాజం ఆధ్వర్యంలో గురువారం 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లోని వారికి వరుసగా రూ.ఐదు, మూడు, రెండు వేల ప్రకారం, ముగ్గురికి ప్రోత్సాహక బహుమతులను అందించారు. చిన్న, సన్నకారు రైతులు, నిరుపేదలు, పేదలు, మైనార్టీలు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతాన్ని రాబోయే నాలుగేళ్లలో మరింత అభివృద్ధి చేసి చూపుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షుడు శిరుమల కృష్ణమూర్తి, కార్యదర్శి హనుమంతు, క్యాషియర్ లోకేష్, మద్దిలేటి సత్యానారాయణ, కండే గోపి, కండే శివప్ప, రంగం నాగరాజు పాల్గొన్నారు.

● గుమ్మఘట్ట : భూపసముద్రంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని గురువారం విప్ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌చార్జ్ కాలవ సన్నన్న, కేపీదొడ్డి నాగరాజు, స్థానిక నాయకులు వన్నూరుస్వామి, హుస్సేన్ గోవిందప్ప పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌లో నీటికొరత



హాస్టల్ సంపును ట్యాంకర్ నీటితో నింపుతున్న సిబ్బంది

పుట్లూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో నీటి కొరత ఏర్పడింది. దీంతో బయట నుంచి ప్రతిరోజూ ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తున్నారు. హాస్టల్‌లో మొత్తం 198 మంది విద్యార్థులున్నారు. ఉన్న బోరులో అరకొర నీరు వస్తోంది. వేసవికాలంలో అయితే నీరు పూర్తిగా బంద్ అవుతుంది. వర్షాకాలంలో అరకొరగా నీరు వస్తుంది. ఆ నీరు చాలకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. విద్యార్థులకు రోజూ రెండు ట్యాంకర్ల మేర నీరు అవసరం అవుతుంది. కానీ పంచాయతీ అధికారులు మాత్రం రెండురోజులకు ఒకసారి ఒక ట్యాంకర్ నీటిని మాత్రమే పంపుతున్నారు. ఎక్కువమంది విద్యార్థులు ఉండడంతో, వారి అవసరాలకు సరిపోవడం లేదని వాపోతున్నారు. ట్యాంకర్‌లోకి వచ్చిన నీటిని సంపులోకి వేసి వాడుకుంటున్నారు. అధికారులు స్పందించి మరో బోరు వేసి నీటి సమస్యను తీర్చాలని విద్యార్థులు కోరుతున్నారు.

కుళ్లిన మాంసం విక్రయం



మాంసంపై ఫినాయిల్ చల్లుతున్న సిబ్బంది

కళ్యాణదుర్గం రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత మార్కెట్ వద్ద కుళ్లిపోయిన మాంసాన్ని విక్రయించడాన్ని గమనించిన ప్రజలు మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయన మార్కెట్ వద్దకు హెల్త్ అసిస్టెంట్ మంజునాథ్, మరో ఇద్దరు సిబ్బందిని పంపించారు. కుళ్లిపోయిన పురుగులు పట్టిన మాంసంపై వారు ఫినాయిల్ చల్లి మున్సిపాల్టీ వాహనంలో కంపోస్టుకు తరలించారు. మాంసం విక్రయిస్తున్న వ్యక్తి అప్పటికే అక్కడి నుంచి ఉడాయించాడు.

చిరుత సంచారంతో ఆందోళన

బెళుగుప్ప, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులెన్న, బెళుగుప్ప, బ్రాహ్మణపల్లి తండా గ్రామాల సమీపంలో నాలుగైదు రోజుల నుంచి ఓ చిరుత సంచరిస్తుండటంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. పగటిపూట మాత్రమే తోటలోకి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. మొక్కజొన్న పైరు ఏపుగా పెరిగింది. చిరుత లోపల దాగి ఉండి దాడి చేస్తుందన్న భయంతో ఉన్నారు. బ్రాహ్మణపల్లి తండాలో గ్రామం పక్కనే గొర్రెల మందపై దాడి చేసి తిప్పేస్వామి నాయక్ గొర్రెను చంపి తినింది. అలాగే ఆవులెన్నలో తిప్పయ్యకు చెందిన మేకను ఎత్తుకెళ్లింది. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సంఘాల్లో అక్రమాలపై ఫిర్యాదు

బెళుగుప్ప, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపురంలో రుద్రమదేవి మహిళా సంఘంలో రూ. 45 వేలు, మంజునాథ సంఘంలో రూ. 22 వేలు అవకతవకలు జరిగాయన్నారని సభ్యులు గురువారం ఎస్ఐ శివకు ఫిర్యాదు చేశారు. తమకు తెలుపకుండానే సంఘంలో ఒక్కరికి వ్యక్తిగత రుణాలు మంజూరు చేశారని, వారు కంతులు సకాలంలో చెల్లించక పోవడంతో పొదుపు డబ్బు జమ చేసుకోవడంతో తాము నష్టపోతున్నామని వాపోయారు. గతంలోనూ సుమారు రూ.20 లక్షలు కాజేశారని, అలాంటి వారినే మళ్లీ యానిమేటర్‌గా నియమించారని వాపోయారు.

సీతారామచంద్రమూర్తులకు పంచామృతాభిషేకం



గుంతకల్లుటౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం పునర్వసు తిరునక్షత్రం సందర్భంగా సీతారామచంద్రమూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయంలోని యాగశాలలో శ్రీ సీతారామచంద్రమూర్తుల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి తిరుమంజన స్నపనం, పంచామృతాభిషేకం నిర్వహించారు.



డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న ఏపీడీ

డ్రిప్ పరికరాలకు దరఖాస్తు చేసుకోండి

కూడేరు, జూలై24(ఆంధ్రజ్యోతి): పండ్లతోటల సాగుకు ప్రభుత్వం సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లు అర్హులైన రైతులందరికి దరఖాస్తు చేసుకున్న వెంటనే అందిస్తోందని ఏపీఎంఐపీ ఏపీడీ ధనుంజయ అన్నారు. గురువారం కొర్రకోడు, కరుట్లపల్లి, చోళసముద్రం తిమ్మాపురం తదితర గ్రామాల్లో రైతులకు సరఫరా చేసిన డ్రిప్ పరికరాలను ఆయన పరిశీలించారు. ఐదు ఎకరాలలోపు ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం సబ్సిడీతో, ఐదు నుంచి పది ఎకరాల వరకు ఉన్న వారికి 70 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలను అందిస్తున్నామన్నారు. ఆయన వెంట ఫినోలేక్స్ డ్రిప్ డీలర్ నాగరాజు, రైతులు ఉన్నారు.

27న మాదిగ ఉద్యోగుల సదస్సు

రాయదుర్గంరూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాలకు సంబంధించి ఆదివారం కళ్యాణదుర్గంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య సదస్సును నిర్వహిస్తున్నట్లు ఎంఈఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఉపాధ్యక్షులు కేపీ నగేష్, కండక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎంఈఎఫ్ సభ్యులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించిన వారు మాట్లాడారు. ఎంఈఎఫ్ సదస్సుకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు, జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్, జిల్లా అధ్యక్షుడు మన్నెపాకుల రమేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్ హాజరవుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మాజీ వైస్ ఎంపీపీకి మాతృవియోగం

కళ్యాణదుర్గం, జూలై24(ఆంధ్రజ్యోతి): కంబదూరు మండల మాజీ వైస్ ఎంపీపీ తలారి యర్రిస్వామి మాతృమూర్తి తలారి వన్నూరమ్మ గురువారం అనారోగ్యంతో మరణించారు. ఆమె మృతదేహానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శ్రావణ ఉత్సవాలకు సర్వం సిద్ధం

నేమకల్లు ఆలయ ఈఓ నరసింహారెడ్డి

ఇంటర్వ్యూ interview



బొమ్మనహాళ్, జూలై 24(ఆంధ్రజ్యోతి): హిందువులకు పవిత్రమైన శ్రావణమాసం వచ్చేసింది. ఈ మాసంలో జిల్లాలోని కసాపురం, మురడి, నేమకల్లు ఆంజనేయస్వామి దేవాలయాలను దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇందుకోసం ఏటా ఆర్టీసీ శ్రావణమాసంలో ప్రత్యేక బస్సు సర్వీసులను కూడా నడుపుతోంది. భక్తుల రాకను దృష్టిలో పెట్టుకుని.. నేమకల్లు శ్రీఆంజనేయస్వామి దేవాలయాన్ని ముస్తాబు చేయడంతో పాటు.. పలు సౌకర్యాలు కల్పించామని ఆ ఆలయం కార్యనిర్వహణాధికారి నరసింహారెడ్డి తెలిపారు. గురువారం ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ ఇలా సాగింది.

ప్రశ్న: ఉత్సవాలకు ఏర్పాట్లు ఎంతవరకు వచ్చాయి?

జవాబు: సర్వం సిద్ధం చేశాం. ప్రతి శని, మంగళవారాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. శ్రావణమాసంలో ప్రతి శని, మంగళవారాల్లో సాయంత్రం ఆలయంలో హోమాలు, పల్లకి సేవ నిర్వహిస్తాం. ఆగస్టు 17న తెల్లవారుజామున ఉత్సవం, సాయంత్రం బ్రహ్మ రథోత్సవం ఉంటుంది. ఆలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. మరుగుదొడ్లు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలన్నీ కల్పించాం.

ప్రశ్న: ఈ ఆలయ ప్రత్యేకత ఏమిటి?

జవాబు: వ్యాసరాయులు వారు నేమకల్లు, కసాపురం, మురిడి శ్రీ ఆంజనేయస్వామి వారి మూలవిరాట్‌ను ఒకే రోజు, ఒకే నక్షత్రంలో ప్రతిష్ఠించారు. ఈ శ్రావణ మాసంలో శనివారం, మంగళవారం ఏదో ఒకరోజు ఈ మూడు దేవాలయలను దర్శించుకుంటే సకలపాపాలు హరిస్తాయి.

ప్రశ్న: ఇతర శాఖల సహకారం ఎలా ఉంది.

జవాబు: ఉత్సవాలు ఏర్పాట్లు ఇతర శాఖల సమన్వయంతో చేస్తున్నాం. పారిశుధ్యం, విద్యుద్దీపాలంకరణ, ఆలయ పరిసరాల్లో వీధి దీపాలు, తాగునీరు తదితర సదుపాయాల కల్పనకు పంచాయతీ సహకారం అందిస్తోంది. భక్తులకు భద్రత, ట్రాఫిక్ విషయంలో పోలీసు శాఖ సహకరిస్తోంది. గ్రామ పెద్దలు, దేవదాయ శాఖ ఉన్నతాధికారులు, పూర్వ ఈఓలు, అలయ అర్చకులు సలహాలు, సూచనలు తీసుకుంటున్నాం.

క్రైం న్యూస్..

మోటారు చోరీ ఇంటి దొంగల పనేనా..?

గుంతకల్లుటౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ ట్యాంక్‌కు పంపింగ్‌కు వినియోగించే రూ. లక్షలు విలువ చేసే 240 హెచ్‌పీ మోటారు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల రెండు రోజుల క్రితం చోరీకి గురైంది. ఇది ఇంటి దొంగలపనేనా అని అనుమానం వ్యక్తం అవుతోంది. ఒకటిన్నర టన్ను బరువున్న ఆ మోటార్ కొద్దిరోజుల క్రితం చెడిపోవడంతో పంపింగ్ గదిలో ఉంచి తాళం వేశారు. ఈ మోటర్‌లో విలువైన కాపర్ వైర్, బుష్, మెటల్ సామాన్లు, బేరింగ్, మెటల్ వైరింగ్ తదితరాలు ఉంటాయి. ఈ మోటార్ చోరీపై మున్సిపల్ ఇంజనీర్ ఇంతియాజ్ వన్‌టౌన్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. చోరీకి గురైన మోటార్ గదిని వన్‌టౌన్ సీఐ మనోహర్ గురువారం పరిశీలించారు. ఇది దొంగల పనేనా, లేక సిబ్బంది పనేనా అనేది పోలీసుల విచారణలో తెలాల్సి ఉంది.

మున్సిపల్ కార్మికుడిపై దాడి

రాయదుర్గం, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్థానిక మారెమ్మగుడి ప్రాంతానికి చెందిన ప్రసన్న తనను కులం పేరుతో దూషిస్తూ.. దాడి చేశాడని మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుడు రమేష్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాను వాటర్ ట్యాంకర్‌ను తీసుకుని నరసయ్యకుంట దగ్గరకు వెళుతుండగా... మార్గమధ్యలో బైక్‌ను ప్రసన్న రోడ్డుకు అడ్డంగా ఉంచారని, తొలగించమని కోరగా.. అతను దుర్భాషలాడి దాడి చేశాడని వాపోయాడు. బాధిత కార్మికుడికి మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున అండగా ఉంటామన్నారు.

హత్యకేసులో నిందితుల అరెస్ట్

తాడిపత్రి, జూలై24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 14వ తేది రాత్రి హర్ష అనే వ్యక్తిని దారుణంగా కొడవళ్లతో హత్యచేసిన కేసులో మరో ఆరుగురు నిందితులను గురువారం అరెస్ట్ చేసినట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు. ఆర్థికలావాదేవీలు, గ్రూపు తగాదాలు ఉండడంతో పలుమార్లు గొడవపడ్డారన్నారు. చివరికి ఈనెల 14న హర్షపై నాగరాజు, మరికొంతమంది దాడిచేసి హతమార్చారని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి నాగరాజు లొంగిపోగా.. గురువారం పరమేష్, అజయ్, దీపక్, హేమంత్, నవీన్, రామ్‌గణేష్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

జూదరులు..

గుత్తిరూరల్ : పెద్దొడి గ్రామాశివారులో గురువారం పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేశామని, వారి నుంచి రూ.4800, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ సురేష్ తెలిపారు. మరో ఐదుగురు పరారీలో ఉన్నారన్నారు.

దిమ్మగుడిలో ఐదుగురు...

పెద్దవడుగూరు: దిమ్మగుడిలోని చౌడేశ్వరి ఆలయ సమీపంలోని ముళ్లపొదల్లో ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశామని, వారి వద్ద నుంచి రూ.20,600ను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు.

మట్కాబీటర్...

తాడిపత్రి : సజ్జలదిన్నె గ్రామానికి చెందిన మట్కాబీటర్ నూర్‌బాషాను గురువారం అరెస్ట్ చేశామని, అతనివద్ద నుంచి రూ.20 వేలు నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

కణేకల్లు, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఓ వివాహితురాలితో అసభ్యకరంగా ప్రవర్తించిన మండలంలోని జక్కలవడికి గ్రామానికి చెందిన గురునాథ్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ శంకర్‌రెడ్డి గురువారం తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.